TS-11-0036701

**మంచిమాట**

మీ వెనక మీ గురించి చెడుగా మాట్లాడేవారిని గురించి ఆలోచించవద్దు. ఎందుకంటే వారి స్థానమెప్పుడూ మీ వెనకే ఉంటుంది.

# నేటి చర్చ

జాతీయ తెలుగు దిన పత్రిక


**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

నేటి చర్చ జాతీయ తెలుగు దిన పత్రిక

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155


తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 53 శుక్రవారం, అక్టోబర్ 23, 2026 , పేజీలు - 12 వెల : 2/-

## 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణమే లక్ష్యం

- దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలి: వెంకయ్య నాయుడు



**హైదరాబాద్, అక్టోబర్ 22 :** 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాల న్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి అనేది ప్రభుత్వాలకే పరిమితం కాకుండా ప్రజలందరి సమష్టి కృషితో సాధ్యమవుతుందని

మిగతా2లో...

# కులగణనతో సామాజిక న్యాయం

- ముదిరాజ్‌లను బీసీ-ఏలో
- చేర్చే అంశంపై అధ్యయనం
- ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న దొడ్డి
- కొమురయ్య విగ్రహాలు: సీఎం రేవంత్‌రెడ్డి






## రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ముగియాలి: మోదీ

- పశ్చిమాసియాలోనూ శాంతి నెలకొనాలి..
- పోలండ్‌తో కీలక ఒప్పంద దిశగా అడుగులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22 :** రష్యాఉక్రెయిన్ యుద్ధం త్వరగా ముగియాలని, పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభానికి శాంతియుత పరిష్కారం లభించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. అంతర్జాతీయంగా శాంతిని నెలకొల్పేందుకు భారత్ అర్థవంతమైన ప్రయత్నాలకు మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. గురువారం న్యూఢిల్లీలో పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో జరిగిన సమావేశం అనంతరం ఇరుదేశాల

మిగతా2లో...

## వరంగల్ కోట అభివృద్ధికి రూ.382 కోట్లు

- కాకతీయుల వైభవానికి కొత్త శోభ
- చారిత్రక కట్టడాల పరిరక్షణ, పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం

**వరంగల్: అక్టోబర్ 22 :** కాకతీయుల చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.382 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఖిల్లా వరంగల్‌తో పాటు హనుమకొండలోని పలు కీలక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఖిల్లా వరంగల్ పునరుద్ధరణ, సెంట్రల్ ప్లాజా నిర్మాణం, బస్ టెర్మినల్ ఏర్పాటు, హనుమకొండలోని వేయి స్తంభాల

మిగతా2లో...



## నవంబర్ 1న బీజేపీ మహా పాదయాత్ర

- జిల్లా కేంద్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు



**హైదరాబాద్, అక్టోబర్ 22 :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు నవంబర్ 1న హైదరాబాద్‌లో మహా పాదయాత్ర నిర్వహించాలని తెలంగాణ బీజేపీ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా

మిగతా2లో...

## సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం

- సంస్థ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం..
- కార్మికుల సంక్షేమానికి కృషి: కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 22 :** సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడటంతో పాటు బొగ్గు గని కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణిని ప్రైవేటీకరణ దిశగా నడిపించే ప్రయత్నాలను అడ్డుకుంటామని, కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని తెలిపారు. గోదావరిఖనిలో ఇటీవల నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన సభ విజయవంతమైన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గురువారం

మిగతా2లో...




## మానవ పుట్టుక ఆదివాసీలతోనే మొదలు

- దేశానికి అసలైన వారసులు గిరిజనులే: మంత్రి సీతక్క

## ఇండియా కూటమి ఆన్‌లైన్ సమావేశం వాయిదా

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న ర్యాలీపై చర్చ వాయిదా



**న్యూఢిల్లీ:అక్టోబర్ 22 :** ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఆందోళనలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌పై తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు ఇండియా కూటమి నేతలు నిర్వహించాల్సిన ఆన్‌లైన్ సమావేశం వాయిదా పడింది. గురువారం సాయంత్రం జరగాల్సిన ఈ సమావేశాన్ని కొన్ని నేతల ముందస్తు కార్యక్రమాల కారణంగా వాయిదా వేసినట్లు సమాచారం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరగాల్సిన ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై నిరసనల కార్యాచరణను రూపొందించడంతో పాటు, నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న కూటమి ర్యాలీ ఏర్పాట్లను సమీక్షించాల్సి ఉంది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ప్రభుత్వాన్ని నిలదీసే వ్యూహాలపైనా చర్చించాల్సి ఉంది. ఇటీవల ఓటరు జాబితా సవరణ అంశంపై ప్రతిపక్ష నేతలు ఢిల్లీలో నిరసన ప్రదర్శన నిర్వహించి, ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో

మిగతా2లో...

## కరువును ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం

- లక్షల ఎకరాల్లో ఎండుతున్న పంటలు.. రైతుల కష్టాలు పట్టించుకోవడం లేదు
- గజ్వేల్‌లో ఎండిన పంటలను పరిశీలించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

**గజ్వేల్,అక్టోబర్ 22 :** రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కో వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని బూరుగుపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే

మిగతా2లో...



# ఇండియా కూటమి ఆన్‌లైన్ సమావేశం వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

తదుపరి ఆందోళనలను ఉమ్మడిగా నిర్వహించేందుకు ఇండియా కూటమి నేతలు కార్యాచరణ రూపొందించాలని భావించారు.సమావేశం వాయిదా పడటంతో తదుపరి తేదీపై స్పష్టత రావాల్సి ఉంది. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లు, ఎన్నికల కమిషన్‌పై చేపట్టబోయే నిరసన కార్యక్రమాలపై కూటమి తదుపరి సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

# సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సింగరేణి ప్రస్తుత పరిస్థితులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్థ ఆర్థిక వ్యవహారాలు, బొగ్గు ఉత్పత్తి తగ్గుదల, టెండర్లలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, సంస్థకు రావాల్సిన నిధుల అంశాలపై చర్చించారు.ద

ఈ అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని కేటీఆర్ పార్టీ నాయకులకు సూచించారు.గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన కార్మిక సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సింగరేణి ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల పునరుద్ధరణ, కార్మిక సంఘం బలోపేతం కోసం సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు సింగరేణి సంస్థ పరిరక్షణకు, కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశానికి హాజరైన పలువురు నాయకులు కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

# కరువును ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం

(మొదటి పేజీ తరువాయి)

చింతా ప్రభాకర్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు ఎండిన పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కరోనా వంటి అంతర్జాతీయ విపత్తును అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎదుర్కొన్నారని, కానీ రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ముందస్తు ప్రణాళికలు రూపొందించి రైతులను ఆదుకునే ప్రయత్నాలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

**12 లక్షల ఎకరాలకు పైగా పంట నష్టం**రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. నెలల ముందుగానే ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రైతులు సాగునీరు, తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పాలకులు స్పందించడం లేదని విమర్శించారు.పత్తి పంటకు ఎకరానికి రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రైతులు వాటిని ఎలా తీర్చుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచి, వారికి అవసరమైన సహాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**పెట్టుబడులు పెట్టినా దక్కని ఫలితం** బూరుగుపల్లి గ్రామానికి చెందిన రైతు భాస్కర్‌రెడ్డి మూడు ఎకరాల్లో వరి సాగు చేయగా, పంటను కాపాడుకునేందుకు రోజుకు రూ.7 వేల వరకు ఖర్చు చేసినప్పటికీ చివరకు పంట పశువుల మేతగా మారిందని హరీశ్‌రావు వివరించారు. రైతులు పంటలను రక్షించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నా, ప్రకృతి పరిస్థితులు మరియు నీటి కొరత కారణంగా నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, ఎండిన పంటల వివరాలను సేకరించాలని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మ నర్సింగరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు బెండ మధు, మాజీ జెడ్పీటీసీ పంగ మల్లేశం తదితర నాయకులు పాల్గొన్నారు.

# మానవ పుట్టుక ఆదివాసీలతోనే మొదలు

**భద్రాద్రి కొత్తగూడెం:అక్టోబర్ 22 :** మానవ పుట్టుక ఆదివాసీలతోనే ప్రారంభమైందని, దేశానికి అసలైన వారసులు ఆదివాసీలేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం ములకపాడులో ఏర్పాటు చేసిన కొమరం భీం విగ్రహాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా లక్ష్మీనగరం కేంద్రం నుంచి ములకపాడు వరకు వేలాది మంది గిరిజనులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కొమరం భీం అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత గిరిజనుల సమస్యలపై శాసనసభలో పోరాడుతామని తెలిపారు.మాజీ ఎంపీ మిడియం బాబురావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జీవో నంబర్ 3 రద్దు అంశంపై గిరిజన ఎమ్మెల్యేలు స్పందించి ఆదివాసీల హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. ఏజెన్సీ అభివృద్ధికి కీలకమైన ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. అనంతరం స్థానికులు వివిధ సమస్యలపై మంత్రికి వినతిపత్రాలు అందజేశారు.మాజీ జెడ్పీ చైర్మన్ చందా లింగయ్య దొర, ఆదివాసీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయండి

**విలీన ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి**

**మంత్రులకు ఆర్టీసీ కార్మిక సంఘాల నేతల విజ్ఞప్తి**



**హైదరాబాద్,అక్టోబర్ 22 :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)ని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం పలువురు మంత్రులను కలిసి తమ విజ్ఞప్తులను తెలియజేశారు.తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ), స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ)కు చెందిన నాయకులు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మంత్రుల నివాస సముదాయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

**పదవీ విరమణ చేసిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి** ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా సంఘాల నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించడంతో పాటు, ఉద్యోగ విరమణ అనంతరం కార్మికులకు ఎదు రవుతున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల నేతల వినతిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్.. పదవీ విరమణ చేసిన ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వారికి గతంలో రావాల్సిన పెండింగ్ బకాయిల చెల్లింపు అంశంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘాల కూటమి నేతలు అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి, వి.ఎస్. రావు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన పేర్కొన్నారు.భారతదేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలంటే యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే దేశం సమగ్రంగా ముందుకు సాగుతుందని తెలిపారు.దేశ ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, సేవాభావంతో పనిచేసే సంస్థలు సామాజిక మార్పునకు దోహదపడాలని ఆయన సూచించారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకూ అందినప్పుడే వికసిత భారత్ లక్ష్యం సార్థకమవుతుందని పేర్కొన్నారు. యువత దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, దేశ నిర్మాణంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియాలి: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

సంబంధాల బలోపేతంపై మాట్లాడారు.భారత్, పోలండ్ మధ్య రక్షణ, అంతరిక్షం, అణుశక్తి, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. డ్రోన్లు, ఉపగ్రహ సాంకేతికతతో పాటు కీలక ఖనిజాలు, ఇంధన రంగాల్లోనూ పరస్పర సహకారానికి అవకాశాలను పరిశీలించారు.**2030 నాటికి వాణిజ్యం రెట్టింపు లక్ష్యం** భారత్‌పోలండ్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోదీ తెలిపారు. భారత్‌యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల మధ్య వ్యాపార, పెట్టుబడి అవకాశాలను మరింత పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు స్టార్టప్ రంగంలోనూ సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు.పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ భారత్‌తో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి తమ దేశం ఆసక్తిగా ఉందని తెలిపారు. ఈ సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక భాగస్వామ్యానికి మరింత ఊతం లభించనుంది.

# కులగణనతో సామాజిక న్యాయం



**హైదరాబాద్,అక్టోబర్ 22 :** ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం సమగ్రంగా అధ్యయనం చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో సరైన గణాంకాలు లేకపోవడంతో ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే ప్రతిపాదనలకు న్యాయపరమైనసమస్యలు ఎదురయ్యాయని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్వహించిన కులగణన వివరాల ఆధారంగా న్యాయనిపుణులు, అధికారులతో సంప్రదించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. **సామాజిక న్యాయమే లక్ష్యం**కులగణన బలహీనవర్గాలకు తమ హక్కుల కోసం నిలబడే ధైర్యాన్ని ఇచ్చిందని సీఎం పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అన్ని వర్గాలకు సముచిత న్యాయం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గంగపుత్రులకు అన్యాయం జరుగుతుందనే అపోహలను తొలగించేందుకు సంబంధిత వర్గాలతో చర్చించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు.**పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయం**జమీందార్లు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పేదలు, బహుజనుల హక్కుల కోసం పండుగ సాయన్న పోరాడారని సీఎం కొనియాడారు. ఆయనతో పాటు దొడ్డి కొమురయ్య చరిత్రను భావితరాలకు పరిచయం చేయాలని, వారికి సముచిత గుర్తింపు కల్పించాలని అన్నారు.రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్న సీఎం, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, శాసనమండలి ఉపాధ్యక్షుడు బండ ప్రకాశ్, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# వరంగల్ కోట అభివృద్ధికి రూ.382 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

గుడి పరిసరాల అభివృద్ధి, మ్యూజికల్ గార్డెన్ వంటి పనులు చేపట్టనున్నారు. చారిత్రక కట్టడాలను పరిరక్షించడంతో పాటు పర్యాటకులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం.**ప్రపంచ బ్యాంకు నిధులతో అభివృద్ధి పనులు** కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పర్యవేక్షణలో ఈ ప్రాజెక్టులను అమలు చేయనున్నారు. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించనున్నారు. చారిత్రక ప్రదేశాలను ఆధునిక సదుపాయాలతో అనుసంధానించడం ద్వారా పర్యాటకులను మరింతగా ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఈ అభివృద్ధి పనులు పూర్తయితే వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి వంటి చారిత్రక ప్రదేశాలకు మరింత ప్రాచుర్యం లభించనుంది. పర్యాటక రంగం విస్తరించడంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు నగర అభివృద్ధికి కూడా దోహదపడనుంది. కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూ వరంగల్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ ప్రాజెక్టులు కీలకంగా మారనున్నాయి.

# నవంబర్ 1న బీజేపీ మహా పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచంద్రరావు అధ్యక్షతన గురువారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం రాంచంద్రరావు మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని ఆరోపించారు. మైనారిటీల ఓట్లను తొలగిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు వాస్తవాలు వివరించేందుకు పాదయాత్ర, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,అక్టోబర్ 22 :** హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. నాంపల్లిలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన పట్టభద్రులందరినీ నవంబరు 6లోపు ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. ప్రతి ప్రాంతంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలని కోరారు. సమావేశంలో మంత్రి అజారుద్దీన్, ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ మీట్‌కు వెళ్లి ఇంటికి తిరిగి రాని ఇంటర్ విద్యార్థిని

**ఆచూకీ కోసం పోలీసుల గాలింపు.**
**సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి.**



చర్చ:- అశ్వారావుపేటఅశ్వారావుపేట మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని మడకం అనూహ్య (16) అదృశ్యమైన ఘటనపై అశ్వారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 12వ తేదీన ఉదయం స్పోర్ట్స్ మీట్ క్యాంపులో పాల్గొనేందుకు కొత్తగూడెం వెళ్లిన అనూహ్య తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో విద్యార్థిని తల్లి మడకం శాంతి అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విద్యార్థిని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

తప్పిపోయిన విద్యార్థిని వివరాలు

మడకం అనూహ్య, వయస్సు 16 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5 అడుగులు, తెల్లని ఛాయ కలిగి ఉంటుంది. అదృశ్యమైన సమయంలో నలుపు రంగు జీన్స్ ప్యాంట్, ఆరెంజ్--ఎరుపు రంగు టాప్ ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థిని ఆచూకీ తెలిసిన వారు లేదా ఆమెకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉన్నవారు వెంటనే అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు. విద్యార్థిని సురక్షితంగా ఇంటికి చేరేలా సహకరించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత...




చర్చ,గోదావరిఖని:అనారోగ్యంతో అకాల మర పొందిన చిరకాల స్నేహితునికి అండగా మేమున్నామంటూ ముందుకు వచ్చి మైత్రి అన్న మాటకు సరైన నిర్వచనాన్ని సాటి సహచర మిత్రులు అందించారు.గోదావరిఖని పవర్ హౌస్ కాలనీకి చెందిన గాజుల పవన్ కుమార్ సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ డివిజన్ ఎస్ ఆర్ పి త్రీ ఓసిపిలో టెక్నిషియన్ గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న 2012 బ్యాచ్ కు చెందిన ఫిట్టర్లు,సింగరేణి వ్యాప్తంగా ఉన్న టెక్నిషియన్ లు తమ వంతుగా మిత్రుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించారు.రూపాయలు మూడు లక్షలు (3,00,000) సేకరించిన నగదును మృతుని పిల్లల పేరు మీద పోస్ట్ ఆఫీసులో జమచేసి ధృవ పత్రాలను గురువారం మృతుని దశదినకర్మ రోజు కుటుంబ సభ్యులకు అందజేశారు.

# రామన్నగూడెంలో భూ హద్దులపై రీ సర్వే

**గిరిజనులు--అటవీ శాఖ మధ్య వివాదానికి పరిష్కారం దిశగా అధికారుల చర్యలు.**





చర్చ :- అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గ్రామ పరిధిలో గిరిజనులు, అటవీ శాఖ అధికారుల మధ్య వివాదం ఉన్న భూములకు సంబంధించి గురువారం రీ సర్వే నిర్వహించారు. రెవెన్యూ సర్వే నంబర్లు 30, 36, 39 పరిధిలోని భూముల హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను గుర్తించేందుకు అధికారులు సర్వే చేపట్టారు.రెవెన్యూ, అటవీ, అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు, సర్వే శాఖ సిబ్బందితో పాటు గ్రామానికి చెందిన ఆదివాసీ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంబంధిత సర్వే నంబర్లలో భూముల విస్తీర్ణం, హద్దులు, అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలిస్తూ అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలను నమోదు చేశారు.ఈ సందర్భంగా మండల సర్వేయర్ నాగరాజు, అటవీ శాఖ రేంజర్ మురళి, అటవీ అభివృద్ధి సంస్థ సత్తుపల్లి డీఎం చంద్రమౌళి, రామన్నగూడెం సర్పంచ్ మడకం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పోలీస్ శాఖ అధికారులు కూడా హాజరై సర్వే ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించారు.భూ హద్దులకు సంబంధించి నెలకొన్న వివాదానికి పరిష్కారం చూపే దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో రీ సర్వే నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సర్వేలో సేకరించిన వివరాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఆపదలో మిత్రుడి కుటుంబానికి చేయూత



చర్చ:- హుస్నాబాద్: మిత్రుడి కష్టాల్లో తోడుగా ఎస్.ఎస్.సి 1990 -91 బ్యాచ్ మిత్ర బృందం ఆపదలో ఉన్న మిత్రుడికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు హుస్నాబాద్ జెడ్పీహెచ్ఎస్ 1990--91 పదో తరగతి బ్యాచ్ మిత్రులు. తమ తోటి మిత్రుడు ఈగ శ్రీనివాస్ కుమార్తె తేజస్విని వైద్య చికిత్స నిమిత్తం రూ.80 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్యాసింజర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయన కుమార్తె తేజస్వినికి కంటి చూపునకు సంబంధించిన సమస్యతో శస్త్రచికిత్స అవసరమైంది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఇప్పటికే సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు కాగా, మరో శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో స్పందించిన పదో తరగతి మిత్రులు తమ వంతు సహాయంగా రూ.80 వేలు అందించారు. తేజస్విని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తదుపరి శస్త్రచికిత్స కోసం మానవత్వం కలిగిన దాతలు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని మిత్రబృందం విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా ఈగ శ్రీనివాస్ తనకు అండగా నిలిచిన మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.మోర రవీందర్, ఎం.డి. నయీమ్, పోగుల రమేష్,ఎం. మచ్చగిరి, సత్యానంద చారి, పెద్ది రవీందర్, వేణు, నూక సంపత్ కుమార్, ఏబీసీ స్వరూప, అయిలేని తిరుమల తదితరులు శ్రీనివాస్ కుటుంబాన్ని కలిసి ఆర్థిక సహాయం అందజేశారు.

# వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ గారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది





నేటి చర్చ : కలెక్టరేట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాబిన్ హుడ్ శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ గారి జయంతిని గురువారం 22-10-2026 నాడు జిల్లా కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పండుగ సాయన్న ముదిరాజ్ గారి చిత్రపటానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏూా) అనంత రామకృష్ణ గారు పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వక్తలు శ్రీ పండుగ సాయన్న గారి జీవిత చరిత్ర మన భావితరాల వారికి ప్రతీక అని తెలియజేయడం జరిగింది, పండుగ సాయన్న గారు మహబూబ్ నగర్ జిల్లా, నవాబ్పేట మండలం, మెరుగోనిపల్లె గ్రామానికి చెందినవాడు, అతని గ్రామీణ క్రీడల్లో ఆరితేరిన వాడు 20 కేజీల గుండును అవలీలగా ఒక్క చేత్తో లేపేవాడు, ఎద్దుల బండిని ఒక్క చేతితో లేపి విసిరేవాడు, అతను పేదలకు ఎంతో సహాయం చేసేవాడు ఆదిపత్య వర్గాల వాళ్ళు బందిపోటుగా అతనిని చిత్రీకరించిన, ప్రజల కోసం నిలబడి ఆధిపత్య వర్గాలపై యుద్ధం చేశాడు ఆకలితో అలమట్టించే ప్రజల కోసం వారిని దోచుకునే దేశముక్ లు , దొరలు , జమీందార్ల గోదాములు పగల కొట్టి ధాన్యం బస్తాలు పేదవారికి పంచిపెట్టేవాడు అన్యాయాలను ఎదుర్కొనేవాడు. పండుగ సాయన్న ముదిరాజ్ సొంతంగా ఆయుధాలు తయారు చేసుకునే వాడు ఒకదలాన్ని ఏర్పాటు చేసుకొని అన్యాయాలకు వ్యతిరేకంగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసేవాడు, పేదలను ఇబ్బంది పెట్టే దేశముక్ లకు, దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసేవాడు. నాటి తెలంగాణ ప్రజలు పండుగ సాయన్న ముదిరాజుని తెలంగాణ రాబిన్ హుడ్ గా పిలిచేవారు.జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శ్రీమతి పి విజయలక్ష్మి గారు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందిఇ ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి గారితో పాటు బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి హరీష్ గారు మరియు ఇతర అధికారులతో పాటు, ఈ కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు శ్రీ బండారి సాగర్ ముదిరాజ్ గారు, సుప్పరి క్రాంతి ముదిరాజ్ గారు, కోళ్ల నాగవర్మ ముదిరాజ్ గారు, శ్రీ అక్కల సీతారామయ్య ముదిరాజ్ గారు, ఉదర వెంకటస్వామి ముదిరాజ్ గారు, లింగయ్య ముదిరాజ్ గారు, అక్కల మధు ముదిరాజ్ గారు, శ్రీనివాస్ ముదిరాజ్ గారు, ఎం రాంబాబు గారు పి వినయ్ ముదిరాజ్ గారు, కే సమ్మయ్య ముదిరాజ్ గారు, ఎన్ యాకయ్య ముదిరాజ్ గారు, ఎన్ సోమయ్య ముదిరాజ్ గారు, సంతోష్ ముదిరాజ్ గారు, శ్రీమతి హారిక ముదిరాజ్ గారు, శ్రీమతి ఉషారాణి ముదిరాజ్ గారు, శ్రీమతి జి సంధ్యారాణి ముదిరాజ్ గారు, ముదురుకొల్ల కిషోర్ ముదిరాజ్ గారు, తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెంచాలి

**ఢిల్లీలో జాతీయ స్థాయి సెమినార్‌లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.**





చర్చ :- అశ్వారావుపేట.దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సులో గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం వంటి గిరిజన జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, రవాణా తదితర మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గిరిజన ప్రజల అవసరాలను గుర్తించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.

పెట్టుబడులతో ప్రాంతీయ అభివృద్ధికి ఊతం

వెనుకబడిన, గిరిజన ప్రాంతాల్లో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు బలోపేతం కల్పించవచ్చని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పరిశ్రమల అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా స్థానికంగా మరిన్ని ఉద్యోగ అవకాశాలు సృష్టించవచ్చని తెలిపారు. ఈ అంశాలపై సెమినార్‌కు హాజరైన పారిశ్రామికవేత్తలు, వ్యాపార రంగ ప్రముఖులతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చర్చించారు.

గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ

గిరిజన యువతకు విద్యతో పాటు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అందుబాటులో ఉన్న అవకాశాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు.

స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెరిగితే యువత వలస వెళ్లాల్సిన పరిస్థితులు తగ్గుతాయని తెలిపారు. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల మధ్య సమన్వయం పెంచడం ద్వారా గిరిజన యువతకు మెరుగైన భవిష్యత్తు కల్పించవచ్చని పేర్కొన్నారు.

వివిధ రంగాల ప్రముఖులతో చర్చ

ఢిల్లీలో జరిగిన ఈ జాతీయ స్థాయి సెమినార్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వివిధ రంగాల ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకునేందుకు వేదికగా నిలిచింది. దేశంలోని వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి అవకాశాలు, పెట్టుబడులను ఆకర్షించే మార్గాలు, యువతకు ఉపాధి కల్పన, సామాజిక అభివృద్ధి తదితర అంశాలపై చర్చలు జరిగాయి.

ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను కూడా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వివిధ రంగాల ప్రముఖుల దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను పెంచడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# జగిత్యాల విద్యారంగంలో కొత్త అధ్యాయం

**.. 25 ఎకరాల్లో భారీ రెసిడెన్షియల్ స్కూల్!**
**ఈ నెల 25న శంకుస్థాపన..**



చర్చ, జగిత్యాల చదువుకోవాలనే తపన ఉన్నా.. ఆర్థిక పరిస్థితులు, సరైన వసతుల లేమితో ఇబ్బందులు పడే విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించే దిశగా జగిత్యాల నియోజకవర్గంలో మరో కీలక అడుగు పడనుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ జగిత్యాల నియోజకవర్గానికి మంజూరు కావడంతో, తాటిపల్లి--మొరపల్లి శివారులో 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ పాఠశాల నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ఈ నెల 25వ తేదీన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు.

ఒకే ప్రాంగణంలో మెరుగైన విద్యా వసతులు!

యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు వెనుక ప్రధాన ఉద్దేశం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులోకి తీసుకురావడం. విశాలమైన 25 ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఈ విద్యాసంస్థ అందుబాటులోకి వస్తే జగిత్యాల నియోజకవర్గ విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి, విద్యా కార్యకలాపాలు ప్రారంభమైతే విద్యార్థుల భవిష్యత్తుకు మరింత తోడ్పాటు లభించే అవకాశం ఉంది. అయితే పాఠశాలలో అందుబాటులో ఉండే తరగతులు, ప్రవేశాల విధానం, వసతి సౌకర్యాలు వంటి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే శంకుస్థాపన కార్యక్రమం నేపథ్యంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ నిర్మాణ స్థలంతో పాటు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, జగిత్యాల నియోజకవర్గానికి ప్రతిష్టాత్మక పాఠశాల మంజూరు కావడం సంతోషకరమని తెలిపారు. అత్యాధునిక వసతులతో పాఠశాల ఏర్పాటైతే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు మరింత అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తుపై ఆశలు, విద్య అనేది విద్యార్థుల జీవితాలను మార్చే శక్తివంతమైన సాధనం.ఈ నేపథ్యంలో జగిత్యాల నియోజక వర్గంలో ఏర్పాటు కానున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌పై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆశలు నెలకొన్నాయి. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి, అవసరమైన వసతులను కల్పించి, పాఠశాలను అందుబాటులోకి తీసుకురావడం కీలకం కానుంది.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, మాజీ జడ్పీటీసీ పెండెం రాములు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల్లో భద్రతా భరోసా కల్పించాలి!

**కథలపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**
**పెండింగ్ కేసుల పరిష్కారం..**




చర్చ, జగిత్యాల: ప్రజలకు పోలీసులపై నమ్మకం పెంచుతూ, నేరాలకు అడ్డుకట్ట వేసి, ప్రతి గ్రామంలో భద్రతా భరోసా కల్పించడమే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీసు సిబ్బందికి సూచించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించే క్రమంలో గురువారం కథలపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక సమీక్ష

స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, బీట్ వ్యవస్థ అమలు తీరును ఎస్పీ సమీక్షించారు. రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా ఎలా కొనసాగుతోందన్న అంశాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా చట్ట ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు సమాచార సేకరణ, నిరంతర నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు.

ప్రతి గ్రామంపై పోలీసులకు పూర్తి అవగాహన ఉండాలి విజిబుల్ పోలీసింగ్ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

- రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపు



**హనుమకొండ, అక్టోబర్ 22 :** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఎన్నికల వ్యూహాలు, ఓటరు నమోదు ప్రక్రియపై చర్చించారు.

### ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి: ఇనగాల

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులతో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం విజయవంతమైందన్నారు. అదే స్ఫూర్తితో జిల్లాలోని ప్రతి డివిజన్, మండల స్థాయిలో సమన్వయ కమిటీలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావంతులు, నిరుద్యోగుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలు, ఉద్యోగ నియామకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి డివిజన్ అధ్యక్షుడు తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేయించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సర్వోత్తమ్ రెడ్డి విజయానికి కృషి చేయాలన్నారు.

### పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలి: ఎమ్మెల్యే నాయిని

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లా డుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడమే తమ ప్రధాన లక్ష్యమ న్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయా లకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి డివిజన్ అధ్యక్షుడు విద్యావంతులు, నిరుద్యోగులు, అర్హులైన పట్టభద్రులను వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదుకు ప్రోత్సహించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సం క్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

### సమష్టి కృషితో విజయం సాధిస్తాం

ఈ సమావేశంలో పాల్గొన్న పీసీసీ ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నాయకత్వంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడతామని తెలిపారు. ప్రతి డివిజన్‌లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ తొగరు జగన్‌మోహన్ రెడ్డి, కో కన్వీనర్ బోడ డిన్న, గ్రంథాలయ చైర్మన్ ఎండీ అజీజ్ ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భట్టి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, తోట వెంకటేశ్వర్లు, విజయశ్రీ రజాలీ, తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, వేముల శ్రీనివాస్, నెక్కొండ కిషన్, డీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 25న పద్మశాలి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

- హనుమకొండలో గోడపత్రిక ఆవిష్కరణ
- పోపా జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్



**హనుమకొండ, అక్టోబర్ 22** ఉమ్మడి వరంగల్ జిల్లా పద్మశాలి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి వరంగల్ శివనగర్‌లోని పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు పోపా జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్ తెలిపారు. గురువారం హనుమకొండలోని పోపా కార్యాలయంలో ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన పద్మశాలి సామాజికవర్గ ప్రముఖులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర్త మురళి, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, కూడా చైర్మన్ గుండు సుధారాణి, ప్రభాకర్ రావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. పద్మశాలి సామాజికవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుండు కామేశ్వర్ కోరారు.ం

# శంషాబాద్‌లో కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**రంగారెడ్డి, అక్టోబర్ 22** మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శంషాబాద్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు, పార్టీ శ్రేణుల సమన్వయంపై సమావేశంలో చర్చించారు.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ డిమాండ్
- జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 22 (సన్):ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ డిమాండ్

**జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 22** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించిన ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, 100 శాతం గ్రాస్ వేతనాలు, సమాన పనికి సమాన వేతనం, 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం హెల్త్ బోనస్, మహిళలకు 180 రోజుల ప్రసూతి సెలవులు, ఈహెచ్‌ఎస్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు.

# అధికారికంగా పండుగ సాయన్న, 174వ ‘ జయంతి వేడుకలు

**చర్చ:- హుస్నాబాద్:** తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు కేటాయించిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జయంతిని పురస్కరించుకుని హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పండుగ సాయన్న చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ, బిసి ,ముదిరాజ్ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వి. వెంకటరమణ మాట్లాడుతూ పండుగ సాయన్న చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని బీసీ సంఘాల తరఫున ప్రభుత్వాన్ని కోరారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల కోసం పోరాడిన ఆయన జీవిత చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.



సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య మాట్లాడుతూ పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అప్పటి సామాజిక అసమానతలు, భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడిన ప్రజా నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉందని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ పండుగ సాయన్న చరిత్ర, పోరాటాలు, ప్రజల కోసం చేసిన సేవలను విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. పేదలు, అణగారిన వర్గాల పక్షాన నిలిచిన ఆయనకు చరిత్రలో తగిన గుర్తింపు కల్పించాలని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ పండుగ సాయన్న జయంతి వేడుకలు ఆయన ఆశయాలను స్మరించుకునే సందర్భమని అన్నారు. సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తించి, ఆయన చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బీసీ, ముదిరాజ్ సంఘాల నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్ కులాన్ని ప్రస్తుత బీసీ-డీ కేటగిరీ నుంచి బీసీ-ఏ కేటగిరీలోకి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పండుగ సాయన్న చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి, ఆయనకు తగిన గుర్తింపు కల్పించాలని కోరారు. పేదలకు అండగా నిలిచి, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ఆయనను ప్రజలు తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పిలుచుకునేవారని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



**చర్చ:- హుస్నాబాద్/ అక్కన్నపేట :**దళారుల నుంచి రైతులను కాపాడాలి రైతులకు మద్దతు ధర కల్పించాలి అక్కన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లో తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు మద్దతు ధర కల్పించాలని బీఆర్ఎస్ అక్కన్నపేట మండల అధ్యక్షుడు గుగులోతు రాజు నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు రైతుల కల్లాల వద్దకే వచ్చి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.అంతేకాకుండా, 15 రోజుల్లో డబ్బులు చెల్లిస్తామని హామీ ఇస్తూ బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే క్రమంలో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రైతులను దళారుల బారిన పడకుండా కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. అక్కన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతుల నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి, గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలని రాజు నాయక్ డిమాండ్ చేశారు.

# ఘనంగా దసరా ఉత్సవ ముగింపు వేడుకలు - శోభయాత్ర.











### భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు.. ఘనంగా శోభాయాత్ర.

**చర్చ :- అశ్వారావుపేట.**దసరా నవరాత్రి ఉత్సవాలు అశ్వారావు పేటలో భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించిన భక్తులు చివరి రోజు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.దసరా ముగింపు సందర్భంగా ఆలయం లోని, పూజా మండపం వద్ద భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ప్రత్యేకంగా పూజల్లో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రగా తీసుకెళ్లారు. ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై దుర్గమ్మ, జై భవానీ నామస్మరణలతో సందడి చేశారు.శోభయాత్ర లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆలయ నిర్వాహకులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.దసరా పండుగ ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు భక్తులు అభినందనలు తెలిపారు.శోభయాత్ర కార్యక్రమం లో ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామస్థులు, ఆర్యవైశ్య కుటుంబాలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# 'కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలి' - గోదావరి జలాల అంశంతో సర్కారుపై ఒత్తిడి పెంచే యోచనలో బీఆర్ఎస్

**హైదరాబాద్ :** కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీరు ఎత్తిపోసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ భావిస్తోంది.కాంగ్రెస్ సర్కారుపై ఒత్తిడి పెంచేలా బీఆర్?ఎస్? నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. కన్నెపల్లి పంప్?హౌస్ నుంచి నీరు ఎత్తిపోసే అంశాన్ని లేవనెత్తాలని, ఈ మేరకు పార్టీ ప్రధాన ప్రజాప్రతినిధులు మేడిగడ్డను సందర్శించేందుకు వెళ్లే యోచనలో ఉన్నారు. ఇందులో భాగంగా రాజధాని ప్రాంత గులాబీ నాయకులు మేడిగడ్డకు వెళ్లాలన్న యోచనలో ఉన్నారు. అక్కడ దిగువకు వెళ్తోన్న గోదావరి జలాలను పరిశీలించి, ప్రజలకు వాస్తవాలు వివరించాలన్నది ప్రధాన ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల ఆలోచన. ఎల్‌నినో కారణంగా కరవు పరిస్థితులున్న ఈ తరుణంలో కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తే హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని అంటున్నారు.కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని డిమాండ్గోదావరి జలాల ఎత్తిపోత అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బీఆర్?ఎస్? వ్యూహరచన చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి సుందిళ్ల, అన్నారం బ్యారేజీల మీదుగా ఎల్లంపల్లి జలాశయానికి తరలించాలని గులాబీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. గోదావరిలో నీరు దిగువకు వెళ్తున్నప్పటికీ ప్రభుత్వం ఎత్తిపోతలపై దృష్టి సారించడం లేదని విమర్శిస్తున్నారు. గతంలో బీఆర్?ఎస్? కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేతృత్వంలోని బృందం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించింది.పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించింది. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు సురక్షితంగా ఉన్నాయని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్?ఎస్?) నివేదిక ఇచ్చిందని గులాబీ నేతలు గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో నీటిని ఎత్తిపోసి ఎల్లంపల్లికి తరలిస్తే సాగునీటితోపాటు తాగునీటి అవసరాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వాదిస్తున్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు, నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలో భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని బీఆర్?ఎస్? నేతలు హెచ్చరిస్తున్నారు.కాంగ్రెస్ సర్కారుపై ఒత్తిడి పెంచేలా బీఆర్?ఎస్? నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. కన్నెపల్లి పంప్?హౌస్ నుంచి నీరు ఎత్తిపోసే అంశాన్ని లేవనెత్తాలని, ఈ మేరకు పార్టీ ప్రధాన ప్రజాప్రతినిధులు మేడిగడ్డను సందర్శించేందుకు వెళ్లే యోచనలో ఉన్నారు. ముఖ్యంగా సింగూరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గడం, హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు గోదావరి జలాలు కీలకం కానున్నాయని పేర్కొంటున్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు నీటి ఎత్తిపోతపై ప్రభుత్వం స్పందించేలా ఒత్తిడి పెంచాలని నగర గులాబీ నాయకత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన బీఆర్?ఎస్? ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.కిందకు వెళ్తున్న గోదావరి జలాల పరిశీలనరెండు, మూడు రోజుల్లోనే ఈ పర్యటన చేపట్టే అవకాశమున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అక్కడి పరిస్థితులను, దిగువకు వెళ్తున్న గోదావరి జలాలను పరిశీలించి నీటిని ఎత్తిపోస్తే కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని నేతలు యోచిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ, బ్యారేజీల భద్రత, నీటి ఎత్తిపోతపై ఇప్పటికే అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మేడిగడ్డ పర్యటన ద్వారా తాగునీటి అంశాన్ని ముందుకు తెచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ప్రధాన ప్రతిపక్షం భావిస్తోంది.

# టీడీఆర్ సేవలకు ఆధార్‌తో గుర్తింపు నిర్ధారణకు ప్రభుత్వం అనుమతి

**హైదరాబాద్, అక్టోబరు 22 :** టీడీఆర్ సేవలకు ఆధార్‌తో గుర్తింపు నిర్ధారణకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆస్తి యజమానులు, బిల్డర్లు, డెవలపర్లకు వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్, లాగిన్, దరఖాస్తుల ప్రక్రియలో ఆధార్ వినియోగించవచ్చని తెలిపింది. ప్రాపర్టీ డేటాబేస్‌తో ఆధార్ అనుసంధానానికి అవకాశం కల్పించింది. ఖజా, +ఎవీజ అధికారులకు ఆన్‌లైన్ అథెంటికేషన్ సదుపాయం కల్పించింది. నకిలీ గుర్తింపులు, మోసాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని రాష్ట్ర సర్కార్ పేర్కొంది. ఆధార్ అథెంటికేషన్ స్వచ్ఛందమేనని.. తప్పనిసరి కాదని స్పష్టంచేసింది. ఈ మేరకు జీవో నంబర్ – 255ను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది.

# తెలంగాణలో దసరా ధూమ్ ధామ్..



**హైదరాబాద్ :**దసరా పండుగ తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. ఈసారి మద్యం అమ్మకాలు గత రికార్డుల న్నింటినీ బద్దలు కొట్టాయి. పండు గకు ముందు కేవలం నాలుగు పనిదినాల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా రూ.755.14 కోట్ల విలువైన మద్యం అమ్ముడై, సరికొత్త రికార్డు సృష్టించింది. గతేడాది ఇదే సమయంలో నమోదైన రూ.698 కోట్ల విక్రయాలను ఈసారి అమ్మకాలు అధిగమించాయి. సాధారణమే అయినా, ఈసారి విక్రయాలు అంచనాలను మించిపోయాయి. ముఖ్యంగా పండుగకు ముందురోజైన అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోవడం గమనార్హం. దసరా ముందు విక్రయాలను పరిశీలిస్తే, అక్టోబర్ 14న రూ.102.17 కోట్లు, 16న రూ.126.32 కోట్లు, 17న రూ.223.25 కోట్ల మద్యం అమ్ముడైంది. 15, 18 తేదీల్లో డిపోలకు సెలవు కావడంతో ఆ రెండు రోజులు మినహాయించి ఈ గణాంకాలు నమోదయ్యాయి.విక్రయాల సరళిని చూస్తే ఎప్పటిలాగే బీర్ల హవా కొనసాగింది. ఈ నాలుగు రోజుల్లో మొత్తం 10.44 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, 6.83 లక్షల కేసుల హార్డ్ లిక్కర్ విక్రయాలు జరిగాయి. ఈ అమ్మకాలతో అక్టోబర్ 19 నాటికే ఈ నెలలో మొత్తం మద్యం విక్రయాల విలువ రూ.2,055 కోట్లకు చేరుకుంది. దసరా సీజన్ కావడంతో నెల చివరి నాటికి విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# వేగం మించితే వెంటనే చలానా - పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై త్వరలో స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్!

**హైదరాబాద్ :**హైదరాబాద్ నగరం నుంచి నేరుగా రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు అనుసంధానించే పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై అతి త్వరలో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ సిస్టమ్ (ఐటీఎస్) వ్యవస్థకు హెచ్‌ఎండీఏ శ్రీకారం చుట్టనుంది. ఎప్పటి నుంచో ప్రతిపాదనల దశలోనే ఉన్న దీనికి తాజాగా ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి వారం పదిరోజుల్లో టెండర్లు పిలవనున్నట్లు సమాచారం.దాదాపు 11.63 కిలోమీటర్ల పొడవు, 4 లైన్లలో ఉన్న ఈ రహదారిపై పరిమితిని మించిన వేగం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఈ రహదారిపై ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టడంతో దాని వెనుక వచ్చే ఆరు కార్లు వరుసగా ఢీకొన్నాయి. ఈ ఘటనకు అతివేగమే మూలకా రణం అని తెలిసింది. నెలలో చిన్నాపెద్దవి కలిపి పదికిపైగా రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిపైకి బైక్‌ల ప్రవేశాలకు నిషేధం ఉంది. పోలీసుల నిఘా కొరవ డటంతో పోకిరీలు తరచూ బైక్‌లపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారుఈ నేపథ్యంలో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే రహదారి భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఐబీటీ



హైదరాబాద్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తూ, అత్యాధునిక ఇంటెలిజెంట్ ట్రాఫిక్ సిస్టమ్ ప్రాజెక్టుకు రూపకల్పన చేయనున్నట్లు సమాచారం. మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వరకున్న ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన ట్లయితే ఇట్టే గుర్తించే విధంగా 29 ఆధునిక కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రమాదాలకు ఎక్కువ ఆస్కారం ఉండే 19 ప్రాంతాల్లో పీటీజెడ్ కెమెరాలు (19) : ఇవి పీటీజడ్ (పాన్ టిల్ట్ జూమ్ సౌకర్యం)తో పనిచేస్తాయి. ట్రాఫిక్ కదలికలు ఎప్పటిక ప్పుడు, మరింత స్పష్టంగా లైవ్‌లో పరిశీలించేందుకు ఉపయో గపడతాయి.ఏఎన్‌పీఆర్ కెమెరాలు (10) : ఈ ఏఎన్?పీఆర్? కెమెరాలు ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ సాంకేతికతతో పనిచేస్తాయి. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వాహనాలను క్షణాల్లో గుర్తించి ట్రాక్ చేస్తాయి.ప్రత్యేక డిస్‌ప్లే బోర్డులు : వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రత్యేక ప్రదర్శన బోర్డులను కూడా ఏర్పాటు చేస్తున్నారు.వీఎస్‌డీ బోర్డులు : వాహనాలకు సంబంధించిన లైవ్ స్పీడ్‌ను డిస్‌ప్లే చేస్తూ అతివేగంగా వెళ్లేవారికి హెచ్చరికగా నిలుస్తాయి.వీఎండీ బోర్డులు : అత్యవసర ట్రాఫిక్ అలర్ట్స్, భద్రతా సందేశాలను వాహనదారులకు చేరవేసేందుకు ఉపయోగపడతాయి. ఈ వ్యవస్థను పర్యవేక్షించేందుకు వీలుగా పిల్లర్ నంబరు 164 వద్ద ఇప్పటికే ఉన్న కంట్రోల్‌రూంకు అనుసంధానం చేయనున్నారు. ఈ వ్యవస్థ కోసం రూ.7 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు.వీఎస్‌డీ బోర్డులు వల్ల వాహనాల ప్రత్యక్ష వేగాన్ని (లైవ్? స్పీడ్?) చూపించడం వల్ల డ్రైవర్లు అప్రమత్తమై స్పీడ్?ను తగ్గించుకు నేందుకు అవకాశం ఉంటుంది. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.గుర్తించి తక్షణమే సెల్‌ఫోన్‌కు చలానాలు పంపిస్తాయి.వీఎండీ బోర్డులతో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలు, రోడ్డు భద్రత సూచనలకు సంబంధించిన సమాచారాన్ని డ్రైవర్లకు ఎప్పటికప్పుడు చేరవేసేందుకు అవకాశం ఉంటుంది.

# కేసీఆర్, రేవంత్ ఒకరినొకరు కాపాడుకుంటున్నారు

**నిజామాబాద్:** తెలంగాణలో రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ప్రకటించిన తర్వాతే క్రాప్ హాలిడే గురించి నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఎంపీ ధర్మపురి అరవింద్ పలు విమర్శలు చేశారు. సాగునీటి ప్రాజెక్టుల డిజైన్ల మార్పుల వెనుక భారీ అవినీతి ఉందని ఆయన ఆరోపించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భవిష్యత్తులో కలవడం ఖాయమని అరవింద్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ గడ్డం పెంచుకున్నంత మాత్రాన ముఖ్యమంత్రి కాలేరని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి వ్యవహారంపై



కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉందని వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా 2029 ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను రాజకీయంగా గల్లంతు చేస్తామని ధర్మపురి అరవింద్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ సునామీ సృష్టిస్తుందని అన్నారు. ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. ముఖ్యంగా పసుపు రైతులకు క్వింటాల్‌కు రూ.50 వేల ధర లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందుకు సంబంధించిన కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు. అవసరమైతే ఈ హామీపై బాండ్ పేపర్ రాసి ఇస్తానని అన్నారు.మరోవైపు, తెలంగాణలో రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలు నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని అరవింద్ ఆరోపించారు. నిజామాబాద్‌లోని మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణం విషయంలో త్వరలో ఆందోళన చేపడతామని ప్రకటించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. రైతుల సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, పసుపు ధరలు, మాధవనగర్ ఆర్వోబీ అంశాలపై ఎంపీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

# హైదరాబాద్‌లో ఆపరేషన్ 'కవచ్'.. పోలీసుల విస్తృత తనిఖీలు

**హైదరాబాద్:** భాగ్యనగరంలో ఆపరేషన్ 'కవచ్' ఉత్కంఠ రేపుతోంది. పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు నగరంలో భారీ భద్రతా ఆపరేషన్‌ను చేపట్టారు. హైదరాబాద్ వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రజల భద్రతే ధ్యేయంగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని జోన్ల డీసీపీలు, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ కవచ్ కొనసాగుతోంది. నగరంలోని ప్రతి ప్రధాన కూడలి వద్ద పోలీసు సిబ్బంది భారీగా మోహరించారు. అనుమానాస్పదంగా కనిపిస్తున్న వ్యక్తులను, వాహనాలను తనిఖీలు చేస్తున్నారు.పత్రాలు లేని, సరికాని నంబర్ ప్లేట్లు ఉన్న వందలాది వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొద్ది రోజులుగా నగరంలో చోటుచేసుకున్న వరుస హత్యలు, నేరాల నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. నేరాల కట్టడి, రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఆపరేషన్ కవచ్ చేపట్టారు. ప్రజల భద్రత కోసమే ప్రత్యేకంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

# తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షాలు.. బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం



**హైదరాబాద్:**తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో అక్టోబర్ 23న (శుక్రవారం) మరో అల్పపీ డనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావ ంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు వాతావరణ శాఖ సూచనలు జారీ చేసింది.థాయ్‌లాండ్ గల్ఫ్, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఆవర్తనానికి అనుబంధంగా ఈ వ్యవస్థ బలపడుతోంది. ఇది ఉత్తర అండమాన్ సముద్రం వైపు కదిలి, ఆ తర్వాత పశ్చిమ–వాయవ్య దిశగా ప్రయాణించనుంది. దీని గమనం, తీవ్రతను బట్టి రెండు రాష్ట్రాలపై వాతావరణ ప్రభావం ఆధారపడి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో వర్ష హెచ్చరికఆంధ్రప్రదేశ్‌పై ఈ అల్పపీడన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నేడు, రేపు ( 22, 23వ తేదీల్లో) కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ అమరావతి కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం బలపడే కొద్దీ ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడటం వంటివి చేయరాదని, ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు కోత కోసిన పంటలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ సమాచారాన్ని అనుసరించాలని అధికారులు కోరుతున్నారు.

# హైదరాబాద్‌కు తిరుగుముఖం పట్టిన జనం నగరంలో ఫుల్ ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్:** దసరా పండుగ ముగించుకొని సొంతూళ్ల నుంచి హైదరాబాద్ వస్తున్న ప్రయా ణీకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకవైపు పండుగ సెలవుల తర్వాత జిల్లాల నుంచి లక్షలాది మంది ప్రజలు నగరానికి తిరిగి వస్తుండటం, మరోవైపు నగరంలో దుర్గామాత విగ్రహాల నిమజ్జన వేడుకలు జరుగుతుం డటంతో హైదరాబాద్ వ్యాప్తంగా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలకు విగ్రహాలు భారీగా తరలిరావడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోలేక ట్రాఫిక్?లో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు హైదరాబాద్‌లోని కీలక రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ముఖ్యంగా ఎల్బీనగర్? నుంచి దిల్?సుఖ్?నగర్ వెళ్లే మార్గంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



ఏర్పడింది. దీన్ని నియంత్రించేందుకు విజయవాడ, నల్గొండ, ఖమ్మం జిల్లాల నుంచి వస్తున్న ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులకు ఎంజీబీఎస్ వైపు వెళ్లొద్దని పోలీసులు సూచిస్తున్నారు. దిల్?సుఖ్‌నగర్‌లోనే దిగిపోవాలని ప్రయాణీకులకు స్పష్టం చేస్తున్నారు. అలాగే కూకట్‌పల్లి, మియాపూర్, పటాన్‌చెరు వైపు వెళ్లే బస్సులను మళ్లిస్తున్నారు. కూకట్‌పల్లి వైపు వెళ్లే వాహనాలను ఉప్పల్, జేబీఎస్ మీదుగా వెళ్లాలని చెబుతున్నారు.వాహనాల రద్దీ విపరీతంగా పెరగడంతో పరిస్థితిని అదుపు చేయడానికి కొన్ని చోట్ల ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా బస్సుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు ట్రాఫిక్ పోలీసులు క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్నారు. అయినప్పటికీ దసరా సెలవుల ముగుంచుకొని నగరానికి వస్తున్న లక్షలాది మంది ప్రజలు ఒక్కసారిగా రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ గందరగోళం తప్పడం లేదు. దీంతో సొంత ఊర్లలో పండుగను సంతోషంగా నిర్వహించుకొని, తిరిగి నగరంలో అడుగుపెట్టిన సామాన్యుడికి ఈ ట్రాఫిక్ కష్టాలు పెద్ద పరీక్షగా మారాయి. తీవ్రంగా రద్దీ నెలకొన్న ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ దారులను చూసుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

## విశాఖలో రోడ్డు ప్రమాదం.. గాయపడిన విద్యార్థులకు హోంమంత్రి అనిత సాయం



**విశాఖపట్నం, అక్టోబర్ 22:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులకు తక్షణ సాయం అందించి హోం మంత్రి అనిత మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. విశాఖలోని ఆరిలోవ హెల్త్ సిటీ బీఆర్‌టీఎస్ రోడ్డులో ప్రమాదం జరిగింది. విద్యార్థులతో వెళ్తున్న స్కూటీని బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. విశాఖపట్నం నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా పాయకరావుపేట వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత.. రోడ్డు ప్రమాదాన్ని గమనించి వాహనాన్ని నిలిపివేశారు.హుటాహుటిన రోడ్డు ప్రమాద బాధితుల వద్దకు చేరుకున్నారు. వెంటనే ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు తక్షణ సాయం అందించారు. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు మంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.

## కూటమి పార్టీల ఉమ్మడి ప్రకటన – ఎస్ఈసీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టీకరణ



**అమరావతి:** వైఎస్సార్సీపీ చేస్తోంది ఎన్నికలపై కుట్రలా? లేక ప్రజాస్వామ్యానికి పరీక్షలా? అని తెలుగు దేశం అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మండిపడ్డారు. స్థానిక ఎన్నికలను అడ్డుకు నేందుకు వైఎస్సార్సీపీ పదేపదే ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఉమ్మడి ప్రకటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటించారు.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాజకీయ వాతావరణం వేడెక్కిన వేళ, కూటమి పార్టీలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. 2024 ఎన్నికల్లో రాష్ట్ర పునర్నిర్మాణం నినాదంతో ప్రజల ముందుకు వెళ్లామని, ప్రజలు కూటమికి పాలనా బాధ్యతలు అప్పగించారని నేతలు గురు చేశారు. గత రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థలు బలోపేతమైతేనే, రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.59 సార్లు కోర్టుల్లో పిటిషన్లు: స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా 16వ ఆర్థిక సంఘం, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను పొందేందుకు అవకాశం ఉంటుందని చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ తెలిపారు. నిర్ణీత గడువులోగా ఎన్నికలు పూర్తి చేసి, స్థానిక సంస్థల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ సంకల్పమని వెల్లడించారు. ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సార్సీపీ ఇప్పటివరకు వివిధ కోర్టుల్లో 59 సార్లు పిటిషన్లు వేసిందని వారు ఆరోపించారు. అడ్డంకులన్నీ తొలగి ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలోనూ పలు ప్రాంతాల్లో హింసను ప్రేరేపించడం, పోలీసులపై దాడులకు పాల్పడటం, ప్రజల కోసం నిర్మించిన రహదారులను తవ్వేయడం వంటి చర్యలకు దిగిందని విమర్శించారు. ఎస్ఈసీ తీసుకునే ఏ నిర్ణయాన్నైనా గౌరవిస్తాం: గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల తీరును కూడా కూటమి అధినేతలు తమ ప్రకటనలో ప్రస్తావించారు. అప్పట్లో ప్రతిపక్షాలు నామినేషన్లు వేయకుండా భయభ్రాంతులకు గురిచేశారని, బలవంతపు ఏకగ్రీవాలతో పాటు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నాటి ఎన్నికల స్వయంగా కేంద్రానికి లేఖ రాయడాన్ని గుర్తుచేశారు. తనకు భద్రత కల్పించాలని నాటి ఎస్?ఈసీ చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రం ప్రత్యేక బలగాలతో భద్రత కల్పించిందని తెలిపారు. ప్రస్తుత ఎన్నికలు ధర్మబద్ధంగా, ప్రజాస్వామ్య యుతంగా జరగాలన్నదే కూటమి అభిమతమని నేతలు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, శాంతియుత వాతావరణం కోసం తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకునే ఏ నిర్ణయాన్నైనా గౌరవిస్తామని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరిగి, ప్రజలు మంచి నాయకులను ఎన్నుకోవాలని, ప్రతి ఇంటికీ అభివృద్ధి ఫలాలు అందాలన్నదే కూటమి లక్ష్యమని ఉమ్మడి ప్రకటనలో కూటమి అధినేతలు వెల్లడించారు.

## వైఎస్ అవినాశ్ రెడ్డి అరెస్ట్.. తీవ్ర ఉద్రిక్తత



**అమరావతి:**పరిషత్ ఎన్నికల నామినేషన్ల వేళ కడపలో తీవ్ర ఉద్రిక్తత పులివెందుల వెళ్తుండగా మార్గమధ్యంలో అరెస్ట్ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని పోలీసుల హెచ్చరిక ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల పర్వం అగ్గి రాజేస్తోంది. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన నాటి నుంచే మొదలైన ఉద్రిక్తతలు ఈరోజు తార స్థాయికి చేరాయి. వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని పోలీసులు కాసేపటి క్రితం అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో కడప జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ వేడి భగ్గుమంది.అసలేం జరిగింది? జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా పులివెందుల నియోజకవర్గంలో ఉద్రిక్తతలు తలెత్తవచ్చని నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో, కడప నుంచి పులివెందులకు బయలుదేరిన ఎంపీ అవినాశ్ రెడ్డి, వైఎస్ ప్రకాశ్ రెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి తదితరులను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా పులివెందులకు వెళ్లరాదని సూచించారు.అయితే, తమ నియోజకవర్గానికి తాము వెళ్లకుండా అడ్డుకోవడం ఏమిటని ఎంపీ అవినాశ్ రెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో పోలీసులకు, వైసీపీ నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో... శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ముందస్తు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి, అవినాశ్ రెడ్డి సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోసమాచారంతోనే ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఏ పార్టీకి చెందిన వారైనా సరే, ఘర్షణలకు ఆస్కారం ఇసేఅదుపులోకి తీసుకోవాల్సి తీసుకున్నారు. ఈ ఘటనపై జిల్లా ఉపేక్షించేది లేదు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలుజరపడమే మా లక్ష్యం. ఇందులో భాగంగానే నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ స్పందిస్తూ... "ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్న పక్కా సమాచారంతోనే ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఏ పార్టీకి చెందిన వారైనా సరే, ఘర్షణలకు ఆస్కారం ఇస్తే ఉపేక్షించేది లేదు. జరపడమే మా లక్ష్యం. ఇందులో భాగంగానే నేతలను అదుపులోకి తీసుకోవాల్సి వచ్చింది" అని స్పష్టం చేశారు.

## అస్వస్థతకు గురైన యనమల రామకృష్ణుడు.. వైద్యులకు ఫోన్ చేసిన సీఎం చంద్రబాబు



**కాకినాడ జిల్లా:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్య సమస్యలతో ఒక్కసారిగా అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. కాకినాడలోని ఓ ప్రైవేట్‌లో చేర్పించగా.. పరీక్షించిన వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించారు. వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి యనమల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.మరోవైపు, రాజ్యసభ ఎంపీ సానా సతీశ్ ఆస్పత్రి వద్దకు చేరుకుని వైద్య చికిత్సను పర్యవేక్షిస్తున్నారు. టీడీపీ సీనియర్ నేత యనమల అస్వస్థతకు గురికావడంతో ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ల.. హఠాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో పార్టీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

## ఏపీ సీఎస్ సాయిప్రసాద్ పదవీకాలం పొడిగించిన ప్రభుత్వం

**అమరావతి, అక్టోబరు 22 :**



ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ పదవీకాలాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ ఏడాది నవంబర్ 30వ తేదీన ఆయన పదవి విరమణ చేయాల్సి ఉన్న విషయం తెలిసిందే. ఈ మేరకు సాయిప్రసాద్ పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించాలని డీఓపీటీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తిపై సాయిప్రసాద్ పదవీకాలాన్ని ఆరు నెలల పాటు డీఓపీటీ పొడిగించింది. దీంతో వచ్చే ఏడాది మే 30వ తేదీ వరకు చీఫ్ సెక్రటరీగా సాయిప్రసాద్ కొనసాగనున్నారు.

## విజయసాయి రెడ్డి ఇంటికి వైఎస్ షర్మిల.. రాజకీయ వర్గాల్లో ఆసక్తి



**అమరావతి:**తన కుమార్తె వివాహానికి హాజరు కావాలని ఆహ్వానం జగన్‌తో విభేదించిన ఇద్దరు నేతల భేటీతో మొదలైన చర్చ భవిష్యత్తులో ఇద్దరూ కలిసి పనిచేస్తారనే ఊహాగానాలు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో వైసీపీలో కీలక నేతలుగా పని చేసి, ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రాజకీయంగా దూరంగా ఉంటున్న ఈ ఇద్దరు భేటీ కావడం ఏపీ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది.బుధవారం విజయసాయి రెడ్డి ఇంటికి వెళ్లిన షర్మిల, తన కుమార్తె అంజలి వివాహ ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. కుటుంబసమేతంగా వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య స్నేహపూర్వక సంభాషణ జరిగింది. షర్మిల ఉద్దేశం వివాహ ఆహ్వానం అందజేయడం అయినప్పటికీ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరి భేటీకి రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. విజయ సాయి రెడ్డి వైసీపీని వీడిన తర్వాత జగన్‌మోహన్ రెడ్డిపైనా, ఆ పార్టీ విధానాలపైనా తీవ్ర విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. నిజమైన రెడ్డి సామాజికవర్గానికి న్యాయం జరగలేదని ఆరోపిస్తూ, త్వరలో కొత్త పార్టీ పెట్టనున్నట్లు కూడా ఆయన ప్రకటించారు.కాగా, షర్మిల అందించిన వెడ్డింగ్ ఇన్విటేషన్‌పై విజయసాయి ఎక్స్ వేదికగా స్పందించారు. "డాక్టర్ వైయస్సార్‌గారి మనుమరాలు, శ్రీమతి షర్మిలమ్మ కుమార్తె అయిన "చిరంజీవి అంజలి" 'ఇచ్చి కుటుంబ సమేతంగా వచ్చి వధూవరులను ఆశీర్వదించాల్సిందిగా శ్రీమతి షర్మిలమ్మ ఈరోజు ఆహ్వానించారు" అని విజయసాయి పేర్కొన్నారు.

## తిరుమలలో ఘనంగా శ్రీమలయప్పస్వామివారి పార్వేట ఉత్సవం



**తిరుమల:**తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల మరుసటి రోజు నిర్వహించే సంప్రదాయ పార్వేట ఉత్సవం బుధవారం వైభవంగా జరిగింది. సాధారణంగా మకర సంక్రాంతి మరుసటిరోజైన కనుమ పండుగనాడు పార్వేట ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే అధికమాసం కారణంగా నిర్వహించిన నవరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం కూడా ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.బుధవారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తుండటంతో, శ్రీవారికి ప్రాతఃకాల ఆరాధన పూర్తయిన తర్వాత శ్రీమలయప్పస్వామివారిని తిరుచ్చిపై ఊరేగింపుగా వైభవోత్సవ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ ఆరాధన, నివేదన, హారతి సమర్పించారు. అనంతరం ఉభయదారులు, తాళ్లపాకవారు, మఠం వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం మర్యాదలు నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ మలయప్పస్వామివారు పార్వేట మండపం నుంచి మహాద్వారానికి చేరుకున్నారు. హతీరాంజీ మఠానికి చెందిన బెత్తాన్ని స్వీకరించి ఆలయ సన్నిధికి వేంచేయడంతో పార్వేట ఉత్సవం ముగిసింది.ముగిసిన నవరాత్రి బ్రహ్మోత్సవాలు: తిరుమలలో 9 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు శ్రీరామపట్టాభిషేకం అలంకారంలో మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు పల్లకి ఉత్సవం నిర్వహించారు.అనంతరం శ్రీభూవరాహస్వామి ఆలయ ముఖమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి వారికి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. మంగళ వాయిద్యాల నడుమ, పండితుల వేదఘోష మధ్యన శ్రీవారి పుష్కరిణిలో అర్చకులు సుదర్శన చక్రాన్ని పవిత్ర జలంలో ముంచి స్నానం చేయించారు. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీవారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ కార్యక్రమాల్లో పెదజీయర్‌స్వామి, చినజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఏపీపీఎస్సీ గ్రూప్-1 మూల్యాంకనం కేసులో సోదాలకు ఈడీ సిద్ధం




**అమరావతి:** ఏపీపీఎస్సీ గ్రూప్–1 మూల్యాంకనం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు వివరాలతోపాటు అందుకు సంబంధించిన ఆధారాలను ఏపీ పోలీసుల నుంచి ఇప్పటికే ఈడీ అధికారులు సేకరించారు. వీటి ఆధారంగా సోదాలు చేపట్టేందుకు ఆ అధికారులు సిద్ధమవుతున్నారు. 2025, ఏప్రిల్‌లో విజయవాడ సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అక్టోబర్10వ తేదీన మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ అధికారులు కేసు నమోదు చేసిన విషయం విదితమే.వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా విశ్రాంత ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుపై ప్రధానంగా ఆరోపణలు వచ్చాయి. గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో ఈ పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం జరిపినట్లు విమర్శలు వచ్చాయి.

# ప్రియాంక కుమారుడి ఆర్ట్ షోలో వివాదం- ఢిల్లీ నిరసనల ఫొటోలు తొలగించాలని ఒత్తిడి



**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ఓ ఆర్ట్ ఎగ్జిబిషన్ చుట్టూ వివాదం మొదలైంది. కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా కుమారుడు రైహాన్ వాద్రా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనలోని కొన్ని చిత్రాలను తొలగించాలంటూ నిర్వాహకులు కోరినట్లు ఆయన ఆరోపించారు. ముఖ్యంగా విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. భారత జాతీయ జెండాకు సంబంధించిన రెండు ఫొటోలను కూడా తొలగించాలని చెప్పినట్లు తెలిపారు. అయితే, జాతీయ జెండా చిత్రాన్ని తొలగించేందుకు తాను అంగీకరించలేదని స్పష్టం చేశారు.రైహాన్ వాద్రా ఇన్‌స్టాగ్రామ్?లో ఆ విషయాన్ని వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో ఆయన ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ బుధవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, ప్రదర్శన ప్రారంభానికి ఐదు గంటల ముందు బికనీర్ హౌస్ నిర్వాహకులు తన వద్దకు వచ్చి, ప్రదర్శనలో ఉన్న చాలా వరకు కళాకృతులను తొలగించాలని ఒత్తిడి చేసినట్లు రైహాన్ ఆరోపించారు. ఆ చిత్రాల్లో ఢిల్లీలో యువత చేపట్టిన నిరసనలకు సంబంధించిన ఫొటోలు ఉన్నాయని తెలిపారు. వాటిలోని అంశాలు అభ్యంతరకరంగా ఉన్నాయని నిర్వాహకులు చెప్పినట్లు పేర్కొన్నారు.తన ప్రదర్శనలోని ఫొటోలను తొలగించాలన్న నిర్ణయాన్ని రైహాన్ వ్యతిరేకించారు. ముఖ్యంగా భారత జాతీయ జెండాకు సంబంధించిన రెండు చిత్రాలను తొలగించాలన్న సూచనను అంగీకరించలేదు. భారత జెండా ఫొటోను ప్రదర్శన నుంచి తొలగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న చిత్రాలతోనే ఎగ్జిబిషన్ కొనసాగిస్తామని చెప్పారు. అవసరమైతే మరో ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని, నిరసనలకు సంబంధించిన పూర్తి ఫొటోలను అక్కడ ప్రదర్శిస్తానని వెల్లడించారు.

రెచ్చగొట్టే అంశాలే లేవు: పవన్ ఖేరా

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా తీవ్రంగా స్పందించారు. బికనీర్ హౌస్‌లో జరిగిన పరిణామాలను ఆయన తప్పుబట్టారు. రైహాన్ వాద్రా ప్రదర్శనలో దాదాపు సగం చిత్రాలను తొలగించినట్లు ఆరోపించారు. మొత్తం 74 కళాకృతులను రాజకీయ అంశాలకు సంబంధించినవిగా పేర్కొంటూ తొలగించినట్లు తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు. ఆ ఫొటోలు నిరసనలను మాత్రమే చూపిస్తున్నాయని, వాటిలో అవమానకరమైన లేదా రెచ్చగొట్టే అంశాలు లేవని పేర్కొన్నారు. నిరసనలకు సంబంధించిన ఫొటోలను ప్రదర్శించడం తప్పెలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. ఒక ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో రాజకీయ అంశాలు ఉన్నాయనే కారణంతో వాటిని తొలగించడం సరైన చర్య కాదని అభిప్రాయపడ్డారు. కళాకృతులపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం వెనుక అసలు కారణమేంటని నిలదీశారు. జాతీయ జెండా ఫొటోను కూడా తొలగించాల్సిన పరిస్థితి రావడంపై ఆయన విమర్శలు చేశారు.తొలగించినంత మాత్రాన వాటిలోని వాస్తవాలను దాచలేరని పేర్కొంది. 'చిత్రాన్ని సెన్సార్ చేయగలరు. కానీ నిజాన్ని కాదు' అనే సందేశంతో సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఈ వ్యవహారం అధికారుల్లో భయాన్ని చూపిస్తోందంటూ విమర్శించింది.

# ఢిల్లీలో నిరసనలు..వ్యాపార నష్టాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు




**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనలు, నిరసనల కారణంగా వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. సీజేపీ తలపెట్టిన నిరసనల నేపథ్యంలో సెంట్రల్ పార్క్‌ను మూసివేయాలని న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేయడం, దీనివల్ల భారీగా వ్యాపార నష్టాలు వస్తాయని ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. వ్యాపారాలకు ఎటువంటి అక్రమ అంతరాయం కలిగినా కోర్టు జోక్యం చేసుకుంటుందని స్పష్టం చేసింది. అయితే, ఈ తరుణంలో తక్షణ ఉత్తర్వులు జరపడానికి నిరాకరించిన కోర్టు, తదుపరి విచారణను అక్టోబర్ చివరి వారానికి వాయిదా వేసింది. పండుగ, పెళ్లిళ్ల సీజన్ కావడంతో వ్యాపారాలు మూతపడితే చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులు, హమాలీల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. కన్నాట్ ప్లేస్ మార్కెట్‌లో ఒక్క రోజు నిరసనల వల్ల సుమారు రూ. 200 కోట్ల వ్యాపారం దెబ్బతింటుందని, అక్టోబర్ 10 నుంచి ఇప్పటివరకు వర్తకులు రూ. 2,000 కోట్ల నష్టాన్ని చవిచూశారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వర్తకులు ప్రధానంగా మూడు డిమాండ్లను కోర్టు ముందుంచారు:మరోవైపు, వ్యాపారుల ఆందోళనలపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్పందిస్తూ.. శాంతియుత నిరసనల సేవలు నిలిపివేసి, రవాణాను నియంత్రించి నగరాన్ని యుద్ధభూమిలా మార్చడం వల్లే నష్టాలు వస్తున్నాయని ఎక్స్ వేదికగా విమర్శించారు.

# పాకిస్థాన్‌కు మద్దతుగా నిలబడదాం.. బీజేపీ నేత వ్యాఖ్యలు వైరల్..



**జైపూర్:** రాజస్థాన్ బీజేపీ అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు మదన్ రాథోడ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారితీశాయి. అమెరికా, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగితే పాక్‌కు భారత్ మద్దతుగా నిలుస్తుందని ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించాయి. అయితే, తన వ్యాఖ్యలను వక్రీకరించారని, అవి భారత్-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ సందర్భంలో చేసినవని మదన్ రాథోడ్ వివరణ ఇచ్చారు.అక్టోబర్ 15న జైపూర్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్ రాథోడ్ ప్రసంగిస్తూ పొరుగు దేశాలతో భారత్ వ్యవహరించే తీరుపై మాట్లాడారు. 'భారతదేశం విషయానికి వస్తే.. ఈ రోజు అమెరికా, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం చెలరేగితే పాక్ మన పొరుగు దేశం కాబట్టి మనం దానికి అండగా నిలబడతాం. కానీ మనలో మనకే సమస్య వచ్చినప్పుడు, మనం భారతదేశానికి అండగా నిలబడతాం కదా? ఈ విషయాన్ని మనమందరం అర్థం చేసుకోవాలి' అని అన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి.

# ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ- తొలి పోస్ట్‌తో ఆత్మకథ ఫస్ట్ లుక్ రిలీజ్




**న్యూ ఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రముఖ సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో అధికారికంగా అడుగు పెట్టారు. వచ్చే నెల విడుదల కానున్న తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఫస్ట్‌లుక్‌ను సోనియా గాంధీ తొలి పోస్టుగా పెట్టారు. పుస్తకం తొలి ప్రతులను అందుకుంటున్న దృశ్యాలతో కూడిన వీడియోను ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. ప్రేమ, విధి నిర్వహణ, నష్టాలు, తనకు తగిన స్థానాన్ని కనుగొనే అన్వేషణ వంటి అంశాలు ఇందులో ఉంటాయని వివరించారు. పుస్తకం తొలి ప్రతులను అందుకున్న సందర్భంగా కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రాతో కలిసి స్వీట్లు పంచుకున్ననిపించాయి. తన జీవితంలోని వ్యక్తిగత అనుభవాలను పాఠకులతో పంచుకునేందుకు ఎదురుచూస్తున్నట్లు సోనియా తెలిపారు.సోనియా గాంధీ ఆత్మకథ భారత ప్రచురణ హక్కులను హార్పర్‌కాలిన్స్ ఇండియా దక్కించుకుంది. నవంబర్ 10న దేశీయ మార్కెట్‌లో ఈ పుస్తకాన్ని విడుదల చేయనున్నట్లు గత నెలలో ప్రకటించింది. ఈ పుస్తకం ప్రచురణ వ్యవహారం గతంలో వివాదానికి దారితీసింది. తొలుత ఆత్మకథను ప్రచురించేందుకు ముందుకొచ్చిన పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా, చివరకు ఆ బాధ్యత నుంచి తప్పుకుంది. మాన్యుస్క్రిప్ట్‌లో సంపాదకీయ మార్పుల విషయంలో ప్రచురణ సంస్థకు, రచయిత ప్రతినిధులకు మధ్య విభేదాలు తలెత్తినట్లు వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు కొందరు ప్రభుత్వ ఒత్తిడి, భావప్రకటనా స్వేచ్ఛ అంశాలను లేవనెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), మోదీ ప్రభుత్వ హయాం లో చైనా భారత భూభాగాన్ని ఆక్రమించిందనే అంశాలకు సంబంధించిన కొన్ని భాగాలను తొలగించేందుకు పెంగ్విన్‌పై ఒత్తిడి వచ్చిందని కొందరు ఆరోపించారు.అయితే, ఈ ఆరోపణలను పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ధ్రువీకరించలేదు. పుస్తకాన్ని ప్రచురించేందుకు తాము ఎంతో ఆసక్తి చూపామని, దాన్ని సాధించడం కోసం గణనీయమైన ప్రయత్నాలు చేశామని సంస్థ పీటీఐకి తెలిపింది. అయినప్పటికీ, ఓ నిర్దిష్ట అంశంపై ప్రతిష్టంభన ఏర్పడటంతో ప్రచురణ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని వివరించింది. ఈ నిర్ణయం వెనక ఎలాంటి బయటి ఒత్తిడి లేదని స్పష్టం చేసింది. అయితే, రచయితతో కుదుర్చుకున్న ఒప్పందం, గోప్యతా నిబంధనల కారణంగా విభేదాలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేమని పేర్కొంది. అనంతరం హార్పర్‌కాలిన్స్ ఇండియా పుస్తక ప్రచురణ బాధ్యతలు చేపట్టడంతో అనిశ్చితికి తెరపడింది.ఇటలీలో బాల్యం నుంచి భారత రాజకీయాల వరకుసోనియా గాంధీ ఆత్మకథ ఆమె బాల్యంతో ప్రారంభమవుతుంది. రెండో ప్రపంచ యుద్ధం అనంతర కాలంలో ఇటలీలోని వెనెటో ప్రాంతంలో గడిపిన రోజులను ఇందులో వివరించారు. అనంతరం విద్యాభ్యాసం కోసం కేంబ్రిడ్జ్‌కు వెళ్లిన ఆమె.. 1965లో అక్కడే రాజీవ్ గాంధీని కలిశారు. రాజీవ్ గాంధీ భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మనవడు. ఆ పరిచయం వివాహ బంధంగా మారిన తర్వాత భారతదేశంలో కొత్త జీవితాన్ని ప్రారంభించిన అనుభవాలను కూడా పుస్తకంలో ప్రస్తావించారు.

# 2030 నాటికీ కాంగ్రెస్ గెలవలేదు- కేజ్రీవాల్‌కు పంజాబ్‌లో పతనం తప్పదు



**న్యూ ఢిల్లీ :** కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీని లక్ష్యంగా చేసుకుని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. దేశంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రతి కూల రాజకీయాల కారణంగా ఆ పార్టీ 2030 నాటికి కూడా ఎన్నికల్లో విజయం సాధించదని పేర్కొన్నారు. చొరబాటుదారులను కాపాడటానికే ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. వచ్చే ఏడాది పంజాబ్‌లో జరిగే ఎన్నికల్లో ఆప్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. పంజాబ్ నుంచి ఆప్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తారని హెచ్చరించారు. యమునా నదిని శుభ్రపరిచేందుకు చేపట్టిన రూ. 8,941 కోట్ల ప్రాజెక్టులను అమిత్ షా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు."దశాబ్దాలుగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు. ఈ ధోరణి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు నుంచే జరుగుతోంది. కానీ, మీరు(ప్రతిపక్షాలు) అనుసరిస్తున్న ఈ ప్రతికూల రాజకీయాలను చూస్తుంటే, 2030 నాటికి కూడా ఎన్నికల్లో గెలవలేరు. అంతేకాదు, కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే గెలుస్తుందో అక్కడ ఎన్నికల సంఘం బాగా పనిచేస్తుందని, ఎక్కడ ఓడిపోతే అక్కడ ఈసీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే, నిరసనలు, ఆందోళనలు చేయడం వల్ల సాధించేదేమీ లేదు. ఇక యమునా నది విషయానికొస్తే, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ పాలకులు మురుగునీటిని వదిలేయడంతోనే యమునా నది కలుషితంగా మారింది. కానీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం మురుగునీటి విడుదలను తగ్గించగలిగింది. యమునా నదికి పునరుజ్జీవం కల్పించిన తర్వాతే 2029 సార్వత్రిక ఎన్నికల కోసం ప్రజల మద్దతు కోరతాం."ఢిల్లీలో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించడానికి గత ప్రభుత్వం ఏమీ చేయలేదని, కేవలం ఆందోళనలు, నిరసనల ద్వారానే రాజకీయాలు చేసిందని షా విమర్శించారు. కానీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం భారీ ప్రక్షాళన చేపట్టామని అన్నారు. రాజధానిలో పేరుకుపోయిన చెత్త డంపింగ్ ప్రదేశాలను ఖాళీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని షా గుర్తు చేశారు. "ఢిల్లీలో మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొదటి నెలలోనే మోదీ ఒక కీలక సమావేశాన్ని నిర్వహించారు. యమునా నది శుద్ధికి సంబంధించిన తన దార్శనికతను ఆయన ఢిల్లీ ప్రభుత్వానికి, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించారు. ఇంత తక్కువ వ్యవధిలోనే, ఈ లక్ష్య సాధన దిశగా మనం ఇప్పటికే 40 శాతానికి పైగా ప్రయాణాన్ని పూర్తి చేశాం. మురుగునీటి శుద్ధి, తాగునీటికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను కూడా కలిగి ఉన్న రూ.9,000 కోట్లకు పైగా విలువైన ఈ ప్రాజెక్టులు, ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఇతర అధికారుల కృషి ఫలితంగా ఈ రోజు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కొత్తగా ప్రారంభించిన కార్యక్రమాలు నది సమగ్ర పునరుజ్జీవనానికి వెన్నెముకగా నిలుస్తాయి. అలాగే నగర తాగునీటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తాయి" అని షా నొక్కి చెప్పారు.అంతకుముందు, నక్సలిజాన్ని రూపుమాపినట్లే దేశం నుంచి మాదకద్రవ్యాల మహమ్మారిని కూడా తరిమేస్తామని అమిత్‌షా స్పష్టం చేశారు. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నొక్కిచెప్పారు. అన్ని రాష్ట్రాల పోలీసులు కలసికట్టుగా, రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని అన్నారు.

# పంజాబ్ సీఎం భగవంత్‌మాన్‌కు రూ. 50వేల జరిమానా!



**న్యూఢిల్లీ:** పంజాబ్ ముఖ్యమంత్రి, భగవంత్‌మాన్‌కు ఢిల్లీ విమానాశ్రయంలో ఊహించని షాక్ తగిలింది. ఫ్రాన్స్ పర్యటన ముగించుకుని ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనను కస్టమ్స్ అధికారులు దాదాపు మూడు గంటల పాటు నిలిపివేసి, జరిమానా విధించారని మీడియా వర్గాలు పేర్కొన్నాయి. సీఎం భగవంత్ మాన్ తన లగేజీలోని కొన్ని లగ్జరీ వస్తువులను డిక్లేర్ చేయడంలో విఫలమయ్యారన్న కారణంతో అధికారులు కస్టమ్స్ సుంకం విధించినట్లు వెల్లడించాయి. పంజాబ్ వ్యవసాయ, ఆహార శుద్ధి ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రమోట్ చేసేందుకు భగవంత్‌మాన్ తన సిబ్బందితో కలిసి ఫ్రాన్స్ వెళ్లొచ్చారు. అయితే, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో గ్రీన్ ఛానెల్ గుండా బయటకు వస్తున్న సమయంలో భగవంత్‌మాన్‌ను ఆపిన అధికారులు ఆయన సామగ్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిక్లేర్ చేయని కొన్ని లగ్జరీ వస్తువులు కనిపించడంతోనే కస్టమ్స్ డ్యూటీ కింద జరిమానా విధించినట్లు తెలుస్తోంది. మరోవైపు, సీఎంపై కస్టమ్స్ చర్యలను ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. మాన్ ఫ్రాన్స్ పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించిందని, ఈ నేపథ్యంలోనే పర్యటన జరిగిందని ఆప్ నేత సౌరబ్ భరద్వాజ్ తెలిపారు. కక్ష్యసాధింపు చర్యల్లో భాగంగానే కేంద్రం ముఖ్యమంత్రిని విమానాశ్రయంలో నిర్బంధించిందని, ఇది పంజాబీలకు జరిగిన అవమానమని మండిపడ్డారు. కేంద్రం ఒత్తిడి మేరకే అధికారులు ఈ విధంగా ప్రవర్తించారని విమర్శించారు.

# అసెంబ్లీని బాంబుతో పేల్చేసినట్లు ఏఐ వీడియో.. బీహార్ వ్యక్తి అరెస్ట్

**బెంగళూరు:** అసెంబ్లీని బాంబుతో పేల్చేసినట్లుగా బీహార్‌కు చెందిన ఒక వ్యక్తి ఏఐ వీడియో సృష్టించాడు. దీనిని ఇన్‌స్టాగ్రామ్‌లో అతడు పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పోలీసులు స్పందించారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. (దీఅష్ట్రుతీ మీఖఅ చాతీతీవర్‌వఃస) కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. బీహార్‌కు చెందిన 25 ఏళ్ల హజ్రత్ అలీ గత కొన్ని నెలలుగా బెంగళూరులో రోజువారీ వేతనంతో పైప్ ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. అక్టోబర్ 20న ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఏఐ వీడియోను అతడు పోస్ట్ చేశాడు. కర్ణాటక శాసనసభ కొలువుదీరే అత్యంత భద్రత కలిగిన బెంగళూరులోని విధానసౌధను బాంబుతో పేల్చివేస్తున్నట్లుగా ఏఐ వీడియోను అతడు సృష్టించాడు. అంతేకాకుండా ఆ భవనాన్ని తానే పేల్చివేసినట్లు ఆ వీడియోలో అతడు పేర్కొన్నాడు.కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పలువురు నెటిజన్లు బెంగళూరు పోలీసులకు ట్యాగ్ చేశారు. ఆ వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను పోలీసులు డీయాక్టివేట్ చేశారు. బీహార్‌కు చెందిన వలస కార్మికుడైన హజ్రత్ అలీని నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడి ఉద్దేశాన్ని తెలుసుకునేందుకు పోలీసులు అతడిని విచారిస్తున్నారు. భయపెట్టే లేదా తప్పుదోవ పట్టించే కంటెంట్‌ను సృష్టించి, ప్రచారం చేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను దుర్వినియోగం చేయవద్దని పోలీసులు హెచ్చరించారు.

# దావూద్ ఇబ్రహీం పాక్‌లోనే ఉన్నాడు- అక్కడే బిన్ లాడెన్‌ను హతమార్చారు: ఐరాస వేదికగా భారత్




**న్యూ ఢిల్లీ :** ఐక్యరాజ్యసమితి రూపొందించిన కౌంటర్- టెర్రరిజం నివేదికలో తమ దేశంపై పక్షపాతం చూపినందుకు ఐరాస ప్రతినిధిపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాగే ఐరాస ఉన్నత ప్రమాణాలతో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చింది. అండర్ వరల్డ్ డాన్, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ దావూద్ ఇబ్రహీం పాకిస్థాన్‌లోనే ఉన్నాడని స్పష్టం చేసింది. ఐరాస ప్రతినిధి బెన్ సాల్ తన నివేదికలో దావూద్ ఇబ్రహీంను భారతదేశ కేంద్రంగా పనిచేస్తున్న 'డీ-కంపెనీ' నేర ముఠా నాయకుడిగా అభివర్ణించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐరాసలో భారత దౌత్యవేత్త రఘూ పూరీ వ్యాఖ్యానించారు.'ఆ నివేదికలో స్పష్టమైన తప్పులు ఉన్నాయి'"ఐరాస ప్రతినిధి ఎటువంటి జవాబుదారీతనం లేకుండా, వాస్తవ విరుద్ధమైన తప్పుడు సమాచారంతో నివేదికలను విడుదల చేయడంపై మేము తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. ఇప్పటికే చట్టబద్ధత పరంగా సవాళ్లను ఎదుర్కొంటున్న ఐరాసకు ఇది ఎంతైనా దురదృష్టకరం. ఐరాస కౌంటర్- టెర్రరిజం నివేదికలో స్పష్టమైన తప్పులు ఉన్నాయి. ఇటువంటి అసమర్థత ప్రపంచ సంస్థకు అపారమైన హాని కలిగిస్తుంది. దావూద్ ఒక మోస్ట్ వాంటెడ్ క్రిమినల్. అతడు పాకిస్థాన్‌లోనే ఉన్నాడు. అదే దేశంలో ఒసామా బిన్ లాడెన్‌ను గుర్తించి హతమార్చారు" అని రఘూ పూరీ పేర్కొన్నారు.దావూద్ ఇబ్రహీంకు చెందిన డీ-కంపెనీ భారత్‌కు చెందినదని ఐరాస ప్రతినిధి వ్యాఖ్యానించాన్ని రఘూ పూరీ తీవ్రంగా ఖండించారు. "2003లో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అల్-ఖైదాతో సంబంధాలు ఉన్నందున డీ-కంపెనీ అనే ఒక క్రిమినల్ గ్రూప్ నాయకుడిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చిందని ఐరాస తన తాజా నివేదికలో పేర్కొంది. ఈ ఒక్క లైన్‌ను విడిగా చదివితే, అసలు వాస్తవానికి భిన్నమైన చిత్రం కనిపిస్తుంది. ఆల్ ఖైదా, దావూద్ ఇబ్రహీం 1993 నుంచి భారత్‌లో జరిగిన ఉగ్రదాడుల కేసులో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు. ఈ విషయం 1267 ఆంక్షల వ్యవస్థ కింద అతడిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడానికి గల వివరణాత్మక సారాంశంలో స్పష్టంగా ఉంది. ఈ నిజాన్ని ఐరాస తాజా రిపోర్టులో పేర్కొనకపోవడం విచారకరం. ఐరాస ప్రతినిధుల ఇటువంటి అసమర్థత ఐక్యరాజ్యసమితికి తీవ్రమైన హాని కలిగిస్తుంది. దావూద్ ఇబ్రహీం 2003 నాటి ఐరాస బ్లాక్‌లిస్ట్‌లో చేర్చడం కంటే చాలా ముందే భారత్ నుంచి పారిపోయాడు.జమ్ముకశ్మీర్, లద్దాఖ్ గురించి ఐరాసలో పాకిస్థాన్ ప్రతినిధి చేసిన వ్యాఖ్యలపైనా రఘూ పూరీ స్పందించారు. ఈ రెండూ ప్రదేశాలు భారతదేశంలో అంతర్భాగాలని పునరుద్ఘాటించారు.

# సంపాదకీయం

## ఉరిశిక్షలు ప్రజాస్వామికమేనా?



ఆనాడు మహేంద్ర కర్మపై, మావోయిస్టు పార్టీ దాడి చేసి చంపింది అనే కారణంతో.. ఈనాడు మావోయిస్టు పార్టీకి చెందిన ఆదివాసి బిడ్డలకు ఉరిశిక్ష ఖరారు చేసింది ఎన్ఐఎ కోర్టు! 2013 మే 25న చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా దర్భా లోయ, ఝీరాం ఘాటీ ప్రాంతం వద్ద జరిగిన దాడి కేసులో.. కాంగ్రెస్ పార్టీ పరివర్తన యాత్ర కాన్వాయిపై, మావోయిస్టు పార్టీ గిరిజనులతో కలిసి దాడి చేసింది. ఆ దాడిలో చత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహేంద్ర కర్మతో పాటు మొత్తం 27 మంది వరకు మరణించారు! ఆనాటి ఈ దాడి ఘటనకు సంబంధించి, గత నెల 16 సెప్టెంబరు 2026 న ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు, పది మంది మావోయిస్టులకు ఉరిశిక్ష విధించింది! ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం, ఈ పరిణామం దేనికి సంకేతం? కగార్ ఆపరేషన్ కంటే ముందు నుండే ఆయుధాలు వీడి ప్రజాస్వామిక పద్ధతుల్లో పనిచేయండి అనీ ప్రభుత్వం మావోయిస్టులకు పిలుపునిచ్చింది!ప్రభుత్వం వేలాదిమంది సైనిక బలగాలను రప్పించి, మావోయిస్టు పార్టీని ఉక్కుపాదంతో అణచివేసింది! శవాల గుట్టలు, రక్తపాతాలు నిత్యకృత్యం అయ్యాయి! వందలాది మంది మావోయిస్టులు అధునాతన ఆయుధాలతో వచ్చి, ప్రభుత్వం ముందు లొంగిపోయారు! ఇప్పుడున్నది మావోయిస్టు రహిత భారతదేశం అని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది! ఈ విధంగా ఇప్పుడు మావోయిస్టు పార్టీ పూర్తిగా లేకుండాపోయింది అని ప్రభుత్వమే ప్రకటించిన నేపథ్యంలో.. ప్రస్తుతం మావోయిస్టులపై మోపబడిన నేరాలు, శిక్షలు వంటి కీలక విషయాల్లో, ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించాల్సి ఉంటుంది అంటే, నూటికి నూరు శాతం ప్రజాస్వామికంగానే, మానవీయంగానే వ్యవహరించాల్సి ఉంటుంది!మావోయిస్టుల నేరాలపై అమలు చేయాలనుకున్న శిక్షల విషయంలో.. ఆ శిక్షల తీవ్రతను తగ్గించే ఒక ప్రజాస్వామిక వాతావరణాన్ని ప్రభుత్వం నెలకొల్పాలి! గతంలోవలె అణచివేత విధానాలను పాటించకూడదు! కానీ ఇప్పుడు జరుగుతున్నది ఏమిటి? ఆనాడు ఆ నేరాలకు పాల్పడ్డారు అనే కారణంతో.. మావోయిస్టు పార్టీలో పని చేసిన అడవి బిడ్డలకు, ఈరోజు ఉరిశిక్షలు ఖరారు చేశారు! ఈ నిర్ణయం న్యాయమేనా? మానవీయమేనా? ప్రభుత్వం ఆలోచించాలి? ఇంతకూ ఈ దేశంలో ఎవరికి ఉరిశిక్షలు పడాలి? నేరస్థులకా? నేర సంస్కృతికా? రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, ఆ నేరమయ సంస్కృతిని వ్యవస్థీకృతం చేసి.. సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలకు కారణమైన పాలక ప్రభుత్వాలకా? ఎవరికి పడాలి ఈ శిక్షలు? ఆనాడు 'పార్లమెంటరీ వ్యవస్థను కూల్చేస్తాం' అనే నినాదంతో బయలుదేరిన వారు చట్ట ప్రకారం నేడు నేరస్థులైతే..రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన చేస్తున్న వాళ్లు, ప్రజల రక్షణ కోసం ఏర్పడిన చట్టాలను అమలు చేయని వాళ్ళు, ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టించిన వాళ్ళు, అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా భూములు ఆస్తులు కొల్లగొట్టిన వాళ్లు.. ఒక్కమాటలో చెప్పాలంటే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న వాళ్లు, నేరస్థులు కారా? తప్పులు చేసిన వాళ్ళు తమ తప్పులు తెలుసుకుని, సరిదిద్దుకునే విధంగా.. సంస్కరణ వాద స్పృహతో శిక్షల విధానం ఉండాలే తప్పా.. తప్పులు చేసిన వాళ్లకు ఇక జీవితమే ఉండకూడదు, శిక్ష పేరుతో వాళ్ళని చంపేయాలి.. అని ప్రభుత్వమే భావిస్తే, అది ప్రజాస్వామిక ప్రభుత్వం అవుతుందా? వ్యక్తి ఆలోచన కంటే ప్రభుత్వం ఆలోచన.. గొప్పగా మానవీయంగా ఉండాలి కదా!ఒక వ్యక్తి హత్య చేసి నేరస్థుడు అయినప్పుడు, ప్రభుత్వం కూడా శిక్ష పేరుతో వ్యక్తిని హత్య చేస్తే, అది నేరం కాకుండా పోతుందా? అందుకే నేరాలు, శిక్షలు వంటి విషయంలో, ప్రభుత్వ పాలన ప్రజలను సంస్కరించే విధంగా ఉండాలి తప్పా.. ప్రభుత్వమే హంతకుడుగా మారి, ప్రజలను హత్య చేసే విధంగా, పాలన విధానాలు ఉండకూడదు! రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కును కాలరాయకూడదు! సాయుధ పోరాటం వల్ల తరతరాలుగా ఉద్యమ ప్రజలు సర్వము కోల్పోయారు! ఇక భవిష్యత్తులో కూడా, అది ఈ దేశంలో సఫలం కాదని చరిత్ర చెబుతుంది! కాబట్టి మావోయిస్టు పార్టీ నాయకులు, చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక పార్టీని నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది! అదే సమయంలో మావోయిస్టు పార్టీ పేరును, దాని అనుబంధ సంఘాల పేర్లను అన్నిటిని తొలగించాలి! మళ్లీ కొత్తగా ప్రతిదీ ప్రజాస్వామిక పద్ధతిలో నిర్మాణం కావాలి! ఉద్యమాల్లో మార్క్సిస్టు సిద్ధాంతమే గైడ్‌లైన్‌గా ఉండాలి తప్పా, మరొక పేరుతో కాదు!అందుకే ఇలాంటి చర్చనీయాంశాలను చర్చించాలంటే, దేవ్ జీ బృందం చేయాల్సిన పని.. మాజీ మావోయిస్టులందరినీ సమావేశపరచడానికి బహిరంగ పిలుపు ఇవ్వాలి! రెండు మూడు రోజుల పాటు కొనసాగేలా ఈ సమావేశం ఉండాలి. ఎంతో మహోజ్వలంగా సాగిన విప్లవోద్యమం, పూర్తిగా అంతరించిపోవడానికి.. పార్టీ వైపు నుంచి, నాయకత్వం వైపు నుంచి, ఉద్యమ శ్రేణుల వైపు నుంచి జరిగిన తప్పిదాలను వైఫల్యాలను సమీక్షించుకునే విధంగా సమావేశం జరగాలి! ప్రస్తుత పరిస్థితుల్లో పూర్తిగా రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయడానికి, ఎలాంటి విధానాలు ఏర్పరుచుకోవాలి అన్న అంశాలపై, ప్రతి వ్యక్తి ఐదు నుంచి పది నిమిషాల పాటు తన అనుభవాలను చెప్పే విధంగా సమావేశం ఉండాలి! ఆ విధంగా అందరి సమష్టి ఆలోచనలను పరిగణలోకి తీసుకొని, రాజ్యాంగ విధానాలకు లోబడే ఒక ప్రజాస్వామిక పార్టీని ఏర్పాటు చేయాలి!అప్పు డే అది ప్రజల్లో విస్తృతంగా పనిచేసి, ప్రజల ఆమోదం పొందగలుగుతుంది. ఉద్యమ లక్ష్యాన్ని సాధించగలుగుతుంది! ఈ విధంగా సామాజిక బుద్ధిజీవుల నుండి, ఉద్యమ శ్రేయోభిలాషుల నుండి తీసుకున్న ఈ సూచనలను, దేవ్ జీ బృందం లేదా మొత్తం కేంద్ర మాజీ నాయకత్వం పరిశీలించి, సాధ్యమైనంత తొందరగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రారంభిస్తారని, ఉద్యమ ప్రజలు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు! విప్లవ సహచరుల ఉరిశిక్ష రద్దు కోసం ఉద్యమాలు చేసి విఫలమైన సరే, ప్రజలు అర్థం చేసుకుంటారు. కానీ ఏమీ చేయకుండా, అధినాయకత్వం ఈ విధంగా మౌనంగా ఉంటే ప్రజలు సహించరు! రేపొద్దున ఆ పదిమంది మావోయిస్టులకు ఒక వేళ ఉరిశిక్ష అమలు అయితే.. అప్పుడు ఈ దేవ్ జీ బృందం మొత్తం కేంద్ర మాజీ నాయకత్వం, ఉద్యమ ప్రజల నుండి తీవ్రమైన నిరసన ఎదుర్కోవాల్సి వస్తుంది! అప్పుడు చరిత్రలో వీళ్ళు ప్రజా వంచకులుగా మిగిలిపోక తప్పదు! కాబట్టి నమ్ముకున్న ప్రజల జీవన వికాసం కోసం, మాజీలంతా ఐక్యమవ్వాలి! ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజా పోరాటాలు నిర్వహించాలి!

# నిద్ర వీడి.. నిప్పు కణాలైతేనే!



దసరాతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. పాతిక యేళ్ల కిందటితో పోలిస్తే మన పండుగల తీరెతెన్నులే మారిపోయాయి. ముఖ్యంగా యువత పరంగా! పండుగలు,- ఉత్సవాలు అంటే మద్యంలో మునిగి తేలడం. దసరా సరదా తీర్చుకోవడంలో ఎన్ని బీరు బాటిళ్లు ఖాళీ అయ్యాయి. ఎన్ని విస్కీ కార్టున్లు అమ్ముడయ్యాయి, ఎంత మద్యం తాగారు? రేపో మాపో లెక్కలు పత్రికల పతాక శీర్షిక లెక్కుతాయి. అందులో విశేషమేం లేదు. విషయమేమిటంటే, గ్రామాల్లో ఇదొక జాడ్యంలా తయారైంది. యువతను పూర్తిగా నిర్వీర్యం చేస్తోంది. ఎవరూ చెప్పేవారు లేరు, అథవా చెప్పినా వినేవారు అసలే లేరు. కల్లు, సారా చీప్ లిక్కర్, దేశీ మద్యం, విదేశీ బ్రాండ్లు ఇలా... ఆర్థిక స్తోమత- స్థాయిని బట్టి ఏదో ఒకటి తాగుతున్నారు. వివిధ రూపాల్లో గంజాయి కూడా విస్తరిస్తోంది. సరదాగా మొదలైన అలవాట్లకు క్రమంగా కట్టుబానిసలవుతున్నారు.వాళ్లు-వీళ్లని తేడా లేదు మిగతా విషయాల్లో ఎట్లున్నా తాగుడుకు వచ్చేసరికి ఉద్యోగులు, నిరుద్యోగులు అని తేడా లేదు. వాళ్లు, వీళ్లు కలిసో, విడివిడిగానో తాగుతూనే ఉన్నారు. రోజువారీ తాగుడు ఒకటైతే పండుగలు, పబ్బాలు, ఉత్సవాలు ఒక బలమైన సాకు (బహానా) వారికి. బోనాల పండుగతో మొదలయితే వినాయకోత్సవాలు, వెంటనే నవరాత్రులు, తర్వాత దీపావళి ఇటు అటు అంటే కొత్త సంవత్సరం, అతి దగ్గరలోనే మూడొద్దల సంక్రాంతి వేడుకల్లో మునిగి తేలడమే! ఉద్యోగులా, వ్యాపారులా, నిరుద్యోగులా అనే తేడాలు లేకుండా మద్యానికి బానిసలవుతున్నారు. జీవితంలో పైకెదగాలనో, జీవన ప్రమాణాలు పెంచుకోవాలనో తపన, పట్టుదల, జిజ్ఞాస వారిలో క్రమంగా సన్నగిల్లుతున్నాయి. సర్కారు వారి పలు స్కీములు కింద లభించే నగదు, చౌక బియ్యం వంటివి అందుబాటులో ఉండటం వల్ల దిగువ మధ్య తరగతి, పేద, నిరుపేద కుటుంబాల కనీస జరుగు బాటుకు ఢోకా లేకపోవడం యువత ఉదాసీన, నిర్లక్ష్య వైఖరికి కారణం కావచ్చని సామాజిక వేత్తలంటారు.ఇరుగు పొరుగు ఏ రాష్ట్రంతో పోల్చినా తెలంగాణలో నిరుద్యోగిత తక్కువేం లేదు. 15 ఏళ్లు పైబడిన వారిలో నిరుద్యోగిత రేటు భారత సగటు 5.4% కాగా తెలంగాణలో అది 5.7%గా నమోదయింది. కూలీల భాగస్వామ్యం రేటు (ఎల్ఎఫ్‌పిఆర్) కూడా తెలంగాణలో ఎక్కువే. తాజా (పిఎల్ఎఫ్ఎస్) సర్వే ప్రకారం దేశ సగటు 54.6% ఉంటే, తెలంగాణలో 58.2% గా తేలింది. అంటే 15 ఏళ్ల పైబడ్డ ప్రతి 10 మందిలో 6 మంది తగిన పని/ ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్నారని లెక్క. తెలంగాణ యువతలో (15 29 యేళ్లు) నిరుద్యోగం రేటు 19.3% అన్నది జాతీయ సగటు కన్నా మూడు రెట్లు అధికం. అందుకే, టెన్త్- ఇంటర్ డ్రాపౌట్స్, డిగ్రీ, డిస్కంటిన్యూలు, ఇంజనీరింగ్‌లోనో, ఏదో సాధారణ డిగ్రీలోనో పట్టా పొందినా ఉద్యోగం లేని, ఉపాధి దొరకని వారు లక్షలమంది ఉన్నారు. సరదాతోనో, అసహనంతోనో మొదలయ్యే తాగుడు అలవాటు వ్యసనంగా మారాక వారా విష వలయం నుండి బయట పడలేకపోతున్నారు. కష్టపడి అదనపు కోర్సులతోనో, నైపుణ్యాల వృద్ధితోనో మంచి ఉద్యోగం పట్టుకోవాలన్న తృష్ణ, పట్టుదల వారిలో చచ్చిపోతోంది. నిన్న కన్నా ఇవాళ, ఇవాల్టి కన్నా రేపు వారు మరింత బలహీనులవుతున్నారు. రాజీపడి, ఏ ఎదుగుదలా లేని అధ్వానపు బతుకులీడుస్తున్నారు.వెలిగే మరో పార్శ్వం ఐటి, ఎఐ వంటి సాంకేతికతను బాగా అందిపుచ్చుకున్న యువతరం మరోవైపు అంచనాలకు మించి ఎదుగుతోంది. విషయంతోపాటు భాష, భావప్రసరణ (కమ్యునికేషన్)లో నైపుణ్యాలు సాధించి ప్రపంచ మూల మూలకూ విస్తరిస్తున్నారు. ఆర్థిక సరళీకరణ, మారిన మార్కెట్ పరిస్థితుల్లో దేశంలోనూ వారికి అవకాశాలు పెరుగుతున్నాయి. అయితే వీరి శాతం చాలా తక్కువ. అటువంటి యువత తెలుగు వాళ్లలోనూ ఉంది. 'కెరీరిజం' తప్ప మరో ధ్యాస ఉండదు, వారిలో సామాజిక స్పృహ జీరో అన్న ఇదివరకటి పరిస్థితి మారింది. వారి దృక్పథంలో, ఆత్మవిశ్వాసంలో, ఆలోచానా సరళిలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. 'నీట్' పేపర్ లీక్ దరిమిలా సాగిన విద్యార్థి, యువ ఉద్యమం పలు ప్రతిఘటనల మధ్య కూడా ఫలితం సాధించింది.ఎన్నికల ప్రక్రియను సంస్కరించాలి, సిఇసి దిగిపోవాలనే డిమాండ్ తో ఇప్పుడు సాగుతున్న ప్రజాందోళనలో యువత క్రియాశీలకంగా ఉంది. ఇవన్నీ గమనిస్తున్న వారు గుర్తిస్తున్నదొక్కటే, యువత ఆలోచన సరళి మారింది. 'కెరీరిజం' గంతలతో సాగే జట్కా గుర్రంలా కాకుండా సమాజాన్ని, సమస్యల మూలాల్ని వారు గ్రహిస్తున్నారు. తగు బాధ్యతతో స్పందిస్తున్నారు. సహనం, పట్టుదల, సమర్థ అభివ్యక్తితో వ్యవహరిస్తున్నారు అని రుజువైంది. 'కాక్రోచ్' అనే మాట వాడి సిజెపి పుట్టుకకు కారణమైన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ గొంతు సవరించుకొని యువతకు కితాబిచ్చారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో, 'బెంగళూరు'లో పలు సందర్భాల్లో మాట్లాడుతూ 'భారత యువత నడతను చూసి గర్విస్తున్నాన'న్నారు.

ఉద్ధవ్ థాకరే (శివసేన) ముంబై శివాజీ పార్కులో జరిగిన దసరా ర్యాలీలో మాట్లాడుతూ 'అవగాహనతో వీధుల్లోకి వచ్చి పోరాడుతున్న యువత విప్లవ యోధుల'న్నారు. 'దేశ యువతలో పెరిగిన ఆత్మవిశ్వాసం, ప్రయోగశీలత, మూస పద్ధతికి భిన్నంగా ఆలోచించే ధోరణి దేశంలో వస్తున్న పెను మార్పుకు సంకేతమ'ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సెలవిచ్చారు. ఆర్ఎస్ఎస్ అధినేత (సర్ సంఘ్ చాలక్) మోహన్ భాగవత్ అయితే యువతను ఏకంగా ఆకాశానికెత్తారు. కిందటి తరం యువతకన్నా, ఇప్పుడున్న భారత్ యువతరం అధిక నిజాయతీ పరులని, ప్రశ్నించడం అలవడి, హేతుబద్ధంగా ఆలోచిస్తున్నారని ప్రశంసించారు. సాంకేతికత వాడుకుంటూ, తెలివితేటలు, -నైపుణ్యాలు పెంచుకుంటూ ఒకవైపు యువత తమ పరిస్థితి మెరుగుపరుచుకుంటూనే మరోవైపు సమాజం గురించి ఎంతో బాధ్యతగా ఆలోచిస్తోంది. కార్యాచరణ అమలు చేస్తోంది. మరోవైపు మెజారిటీ యువత నిరుద్యోగం, ఉపాధి లేమితో కొట్టుమిట్టాడుతూ మద్యం, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసవుతోంది. తెలుగు తేజం వెలగాలి భాషలునేర్చుకోండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో యువత అప్రమత్తం కావాలి. ఆత్మపరిశీలన జరగాలి. దేశ యువతరమంతా పురోగామిగా సాగుతున్నప్పుడు వెనుకబాటు తగునా? అని తెలుగు యువతరం ఆలోచించాలి. తాత్కాలికమైన తృప్తినిచ్చి, మత్తులో జీవితాల్నే చిత్తుచేసే మద్యం మహమ్మారి మాయా వల(యం) నుంచి బయటపడాలి. చిత్తశుద్ధితో ఎవరికి వారు ఆలోచించి, 'నడత' మార్చుకొని సమాజానికి బలమైన వనరుగా మారాల్సిన సమయం. 'ఓటర్ల జాబితా మంజూరీకి పేర్ల' నమోదు కోసం వెళితే గ్రామాల్లో ఎక్కువ మంది యువతులు, నడి వయస్కులు పేర్లు రాపించుకుంటున్నారు. మ్యాప్‌లుచూడండి ఏమిటని ఆరాతీస్తే, వారి భర్తలు చిన్న వయసులో తాగుడుకు బానిసలై చనిపోయినట్టు తెలుస్తోంది' అన్న తెలంగాణ (మెదక్ జిల్లా) ఎంపిడిఒ ఒకరి మాటలు ఎవరి గుండెనైనా కలతపెట్టేవే! కంటతడి పెట్టించేవే!! ఎందరో జాతి వైతాళికులు ప్రేరణనిచ్చిన గడ్డ మన తెలుగు నేల.

ఐడి కార్డు లేదని జవహర్ లాల్ నెహ్రూనే లోనికి అనుమతించని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, విశ్వస్థాయిలో మేధస్సు -తరగని గుండె ధైర్యం కలగలిసిన జార్జిరెడ్డి, రాజు ఎంత బలవంతుడయినా తాను ప్రజాపక్షం వహిస్తానని 'నిజం' కోసం గొంతువిప్పి ప్రాణాలర్పించిన షోయబుల్లాఖాన్ వంటి వారు నడయాడిన నేల ఇది. ఈ నేలలో మొగ్గతొడిగిన యువ కిశోరాలు లక్ష్యం లేకుండా రాజీపడొద్దు. మద్యం మత్తులో జోగొద్దు. జాగృతం కావాలి. తమను తాము మెరుగుపరుచుకుంటూ సమాజానికి సమర్థ వనరు కావాలి.

# ఫ్రాన్సు ఎందుకు తగలబడుతోంది?

### ఆందోళనల వెనుక కమ్యూనిస్టుల కుట్ర ఉందా? ఆర్థిక సంక్షోభమే అసలు కారణమా!

### పొదుపు చర్యల పేరుతో సంక్షేమంపై కోతలు.. వీధుల్లోకి విద్యార్థులు, కార్మికులు

### ఐరోపాను కమ్ముకుంటున్న ఆర్థిక మాంద్యం భయాలు.. ప్రజా అసంతృప్తిని రాజకీయంగా మలుచుకుంటున్న మితవాద శక్తులు



ఫ్రాన్సులో విద్యార్థులు, కార్మికుల ఆందోళనలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, పొదుపు చర్యలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాలపై నిరసనలు వ్యక్తమవుతుండగా, వాటి వెనుక కమ్యూనిస్టులు, సోషలిస్టుల కుట్ర ఉందంటూ మరోవైపు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆందోళనలను కేవలం రాజకీయ కుట్రగా చూడాలా? లేక ప్రజల ఆర్థిక ఇబ్బందులు, తగ్గుతున్న కొనుగోలు శక్తి, పెరుగుతున్న జీవన వ్యయం వంటి మౌలిక సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలా? అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది.ఒకవైపు అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సమావేశాల్లో ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించడం, ఆర్థిక క్రమశిక్షణను పాటించడం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ప్రభుత్వాలు అమలు చేస్తున్న పొదుపు చర్యలు తమ జీవితాలపై ప్రభావం చూపుతున్నాయంటూ వివిధ దేశాల్లో ప్రజలు నిరసనలకు దిగుతున్నారు. ఈ రెండు పరిణామాల మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తే, ప్రస్తుత ఆందోళనలకు కేవలం రాజకీయ కోణమే కాకుండా ఆర్థిక, సామాజిక నేపథ్యం కూడా ఉందని స్పష్టమవుతుంది. **ఆందోళనలకు కమ్యూనిస్టులే కారణమా?** ఫ్రాన్సులో జరుగుతున్న విద్యార్థి ఉద్యమం వెనుక కమ్యూనిస్టులు, సోషలిస్టుల హస్తం ఉందంటూ కొన్ని రాజకీయ శక్తులు ఆరోపిస్తున్నాయి. అమెరికాకు చెందిన ఫాక్స్ న్యూస్ కూడా ఉద్యమంలో పాల్గొన్న వివిధ సంస్థల సంబంధాలను ప్రస్తావిస్తూ కథనాలను ప్రసారం చేసినట్లు నవతెలంగాణ సంపాదకీయంలో పేర్కొన్నారు. విద్యార్థి, యువజన, కార్మిక సంఘాలు, వామపక్ష రాజకీయ సంస్థలు ఉద్యమానికి మద్దతు ఇవ్వడాన్ని ఈ ప్రచారంలో ప్రధానంగా చూపించారు.అయితే ఏదైనా ఉద్యమానికి రాజకీయ పార్టీలు లేదా సామాజిక సంస్థలు మద్దతు ఇవ్వడం ఒక్కటే దాని వెనుక కుట్ర ఉందని నిరూపించదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వివిధ సంఘాలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, ప్రజల సమస్యలపై నిరసనలకు మద్దతు ఇవ్వడం సహజమైన పరిణామం. అదే సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటే వాటిపై స్వతంత్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. కానీ నిరసనల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఒకే రాజకీయ ముద్రతో చూడడం వల్ల అసలు సమస్యలు మరుగునపడే ప్రమాదం ఉంది. **పొదుపు చర్యల ప్రభావం ప్రజలపై ఎంత?** ప్రభుత్వాలు తమ బడ్జెట్ లోటును తగ్గించుకోవడానికి, అప్పులను నియంత్రించడానికి ఖర్చులను తగ్గించే చర్యలు చేపడుతుంటాయి. అయితే ఈ చర్యల్లో భాగంగా విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక భద్రత వంటి రంగాలపై వ్యయం తగ్గితే దాని ప్రభావం నేరుగా సాధారణ ప్రజలపై పడుతుంది. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ప్రభుత్వ సేవలపై ఎక్కువగా ఆధారపడుతుంటాయి. అందువల్ల సంక్షేమ వ్యయాన్ని తగ్గించే నిర్ణయాలు వారి జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.ఫ్రాన్సులో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, తరగతి గదుల్లో విద్యార్థుల రద్దీ, ఉపాధ్యాయుల కొరత వంటి అంశాలను కూడా సంపాదకీయంలో ప్రస్తావించారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, తగిన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించడం వంటి డిమాండ్లు ప్రజా సేవల నాణ్యతకు సంబంధించినవే. ఇటువంటి సమస్యలపై విద్యార్థులు, కార్మికులు, ఇతర సామాజిక వర్గాలు ఆందోళనలకు దిగితే వాటి వెనుక ఉన్న కారణాలను పరిశీలించడం ప్రభుత్వ బాధ్యత.ప్రభుత్వ అప్పులు పెరగడం ఒక సమస్య అయితే, వాటిని తగ్గించే పేరుతో ప్రజలకు అవసరమైన సేవలను బలహీనపరచడం మరో సమస్య.

## జయశంకర్ భూపాలపల్లి జిల్లా, భగీరథిపేట ప్రాజెక్ట్ )కు చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను అరెస్టు చేసిన ఏసీబీ

**భూపాలపల్లి**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, భగీరథిపేట ప్రాజెక్టుకు చెందిన ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ సతీష్ రెడ్డి మరియు టెక్నికల్ ఆఫీసర్ శ్రీ రాజులపై ఏసీబీ, వరంగల్ రేంజ్ పరిధిలో క్రిమినల్ దుష్ప్రవర్తనకు సంబంధించి కేసు 12/2026, తేదీ: 14.10.2026) నమోదైంది. 2.0 పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను ప్రాసెస్ చేయడానికి మరియు మరికొన్ని కొత్త పనులను కేటాయించడానికి, నిందితులైన అధికారులు ఒక కాంట్రాక్టరును అక్రమంగా డబ్బులు (లంచం) డిమాండ్ చేశారనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. తాము అడిగినంత డబ్బు చెల్లించకపోతే, పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రాసెస్ చేయబోమని మరియు తదుపరి పనులను కేటాయించబోమని సదరు అధికారులు కాంట్రాక్టరును బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుదారు అందించిన సమాచారం మరియు ఏసీబీ జరిపిన విచారణ ప్రకారం, నిందితులు సూచించిన వివిధ బ్యాంక్ ఖాతాలు యూపీఐ ఖాతాల్లోకి మొత్తం రూ. 39,17,000/- నగదు బదిలీ చేయబడింది. ఈ ఆరోపణలకు మద్దతుగా ఫిర్యాదుదారు బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను మరియు వాట్సాప్ చాట్ రికార్డులను కూడా సమర్పించారు. అంతేకాకుండా, అదనపు పనులకు సంబంధించిన కొలతలను నమోదు చేయడానికి మరియు పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రాసెస్ చేయడానికి, ఏడవ బిల్లుకు సంబంధించిన మొత్తంలో అదనంగా 25% వాటాను ఏఓ డిమాండ్ చేశారు. రికార్డుల్లో ఉన్న ఆధారాలు మరియు సమర్థ అధికారి ఇచ్చిన అనుమతి మేరకు, అవినీతి నిరోధక చట్టం, 1988 (2018లో సవరించబడినది) లోని సెక్షన్లు 7 7(ఎ) మరియు 13(1)(ఎ)లతో పాటు సెక్షన్ 13(2) కింద కేసు నమోదు చేయబడింది. నిందితులైన అధికారులు–ఏఓ–1శ్రీసతీష్ రెడ్డి మరియు ఏఓ–2 2) శ్రీ రాజు---లను వరంగల్ రేంజ్ ఏసీబీ అధికారులు 22.10.2026న అరెస్టు చేశారు. వీరిని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం వరంగల్‌లోని ఎస్పీఈ ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరుస్తున్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోంది. సెల్ ఫోన్ నంబర్ – 1064 (టోల్–ఫ్రీ నంబర్) ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే, చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రజలు ఏసీబీ (ఛాజదీ) టోల్–ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించవచ్చు. అలాగే, వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ మరియు ఎక్స్ (గతంలో ట్విట్టర్ – ద్వారా కూడా తెలంగాణ ఏసీబీని సంప్రదించవచ్చు. తెలంగాణ ఏసీబీని సంప్రదించడానికి వీలుగా, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మరియు ప్రముఖ బహిరంగ ప్రదేశాల్లో ఏసీబీకి సంబంధించిన క్యూఆర్ కోడ్ ప్రదర్శించబడింది. ఫిర్యాదుదారుని పేరు మరియు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

## జడ్పిటిసి అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్లు

**కామవరపుకోట, అక్టోబర్ 22 :** కామవరపుకోట జడ్పిటిసి అభ్యర్థులుగా కామవరపుకోట మండలం నుండి ముగ్గురు నామినేషన్లు వేశారు. ఇందులో తెలుగుదేశం పార్టీ నుండి చింతలపూడి మాజీ ఎమ్మెల్యే గంటా మురళి కుమార్తె మందలపు జాహ్నవి, కామవరపుకోట మండల పార్టీ మాజీ అధ్యక్షులు ఏలూరి హరి భార్య రమాదేవి, జనసేన పార్టీ నుండి సాధనాల ప్రసాద్ తల్లి సుబ్బలక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు. ఇదిలా ఉండగా కామవరపుకోట మండలం నుండి మాజీ ఎంపీ, మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాగంటి బాబు భార్య పద్మవల్లి దేవి శుక్రవారం నామినేషన్ వేస్తారని బాబు సన్నిహితులు తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి వైసీపీ సీనియర్ నాయకులు దేవరపల్లి రామ్మోహన్రావు (బుజ్జన్న ) కోడలు దేవరపల్లి రాధిక నామినేషన్ వేశారు. అయితే



మాగంటి బాబు భార్య పద్మవల్లి దేవి, మాజీ ఎమ్మెల్యే కుమార్తె జాహ్నవి జిల్లా పరిషత్ చైర్మన్ రేస్‌లో ఉన్నట్లు ప్రకటించారు. కూటమిలో ముగ్గురు నామినేషన్ వేయడంతో ఏమి జరుగుతుందో తెలియక పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆలోచనలో పడ్డారు.

## జిల్లాలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.

**ఏలూరు, అక్టోబర్, 22 :** జిల్లాలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులతో గురువారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారులు దగ్గరుండి పరిశీలించాలన్నారు. రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, వీడియో చిత్రీకరణ చేయించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ లలో బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు ప్రతీ బ్యాలెట్ బాక్స్ నెంబర్‌తో మార్కింగ్ చేయించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో ఓట్ల సంఖ్యకు అనుగుణంగా టేబుల్స్ ఏర్పాటు చేయాలనీ, కౌంటింగ్ సిబ్బంది, రాజకీయపక్షాల ప్రతినిధులు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు వేరువేరుగా ఉండేలా చూడాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రెండంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటుచేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఓట్ల కౌంటింగ్ సమయంలో వీడియో చిత్రీకరణతోపాటు, సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ ఎం. కృష్ణ మోహన్, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, ఆర్ఓ లు, ఏఆర్ఓ లు, పాల్గొన్నారు. ఎన్ఐసి అధికారులు ఫణికృష్ణ, సుజాత, ప్రభృతులు పాల్గొన్నారు.




## దత్తిరాజేరు కూటమి జెడ్పీటీసీ అభ్యర్థిగా మిత్తిరెడ్డి వెంకట రామ సింహాచలం నామినేషన్

**విజయనగరం అక్టోబర్ 22 :** విజయనగరం జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికల నేపథ్యంలో దత్తిరాజేరు మండలం తెలుగుదేశం పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థిగా మిత్తిరెడ్డి వెంకట రామ సింహాచలం నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం లో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రాష్ట్ర సాధికారత శాఖ మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, దత్తిరాజేరు మండలంలో కూటమి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి, జెడ్పీటీసీ స్థానాన్ని భారీ మెజారిటీతో గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు, కూటమి నాయ కులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఒక్కో లఖ్‌పతి దీదీ వెనుక ఒక్కో విజయగాథ

- **ఎస్‌హెచ్‌జీల శక్తిని చాటుతున్న మహిళామణులు**
- **విజయవాడలో వైభవంగా జాతీయ సరస్ మేళా**
- **గత 10 రోజుల్లోనే రూ. 6 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు**
- **ప్రతిఒక్కరూ మేళాను సందర్శించండి చేనేత, హస్తకళలను ప్రోత్సహించండి**
- **జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సరస్ సమన్వయకర్తలు కటారియా, సుధీర్‌కుమార్**

**విజయవాడ, 22.10.2026 :** విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా గత పది రోజులుగా అత్యంత విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. మేళాలో పాల్గొన్న ప్రతి లఖ్‌పతిదీదీ వెనుక ఒక్కో విజయగాథ ఉందని పేర్కొన్నారు. గురువారం పున్నమిఘాట్ వద్ద జాతీయ సరస్ మేళా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సాధారణంగా దేశ రాజధాని ఢిల్లీలోనే జరిగే జాతీయస్థాయి సరస్ మేళాను.. కేంద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తొలిసారిగా ఢిల్లీ వెలుపల విజయవాడలో నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. భారత రాష్ట్రపతి గౌరవ ద్రౌపది ముర్ముగారు ప్రారంభించిన నాటి నుంచి మేళాకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని వెల్లడించారు. ?కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి దాదాపు 600 స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తల స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత 10 రోజుల్లోనే రూ. 6 కోట్లకుపైగా వ్యాపార లావాదేవీలు నమోదయ్యాయని, ఇది ఢిల్లీ స్థాయి అమ్మకాలతో సమానమని చెప్పారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 'ఇండియా ఫుడ్ కోర్ట్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, దేశంలోని విభిన్న సంప్రదాయ వంటకాలను ప్రజలకు రుచి చూపిస్తూ మహిళా సంఘాలు అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నాయని ప్రశంసించారు. సరస్ మేళా కేవలం వస్తువుల విక్రయాలకే పరిమితం కాకుండా మహిళా పారిశ్రామికవేత్తల ఆలోచనలను పరస్పరం పంచుకునేందుకు, నెట్‌వర్కింగ్‌కు, గ్లోబల్ బ్రాండింగ్‌కు ఒక గొప్ప వేదికగా నిలిచిందని వివరించారు. ప్రతి రోజూ బయ్యర్స్, వివిధ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఉత్పత్తుల బల్క్ ఆర్డర్లు, ప్రమోషన్లకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల చేనేత, హస్తకళల నాణ్యమైన ఉత్పత్తులు సరసమైన ధరలకే ఒకేచోట లభిస్తున్నాయని, కుటుంబ సమేతంగా అందరూ సరస్ మేళాను సందర్శించి మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఎన్ఐఆర్‌డీ సరస్ మేళా సమన్వయకర్త కటారియా మాట్లాడుతూ విజయవాడలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 13 నుండి 31 వరకు జాతీయ సరస్ మేళాను నిర్వహిస్తున్నారన్నారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్ పరిధి వెలుపల ఈ స్థాయి జాతీయ సరస్ మేళాను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారన్నారు. ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా దాదాపు 1,500 మందికి పైగా గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొంటున్నారన్నారు. సందర్శకుల కోసం వివిధ రాష్ట్రాల సంప్రదాయ వంటకాలతో 50 ప్రత్యేక ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు. సరస్ మేళాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్రింది స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ పూర్తి సహకారం అందిస్తున్నారని అన్నారు. సరస్ మేళా కోఆర్డినేటర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ సందర్శకులు, చేతివృత్తుల వారికి సహాయపడేందుకు వెల్‌కమ్ పెవిలియన్, వివిధ ప్రభుత్వ శాఖల పథకాలను వివరించేందుకు కన్వర్జెన్స్ పెవిలియన్, మహిళలకు బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్‌పై శిక్షణ ఇచ్చేందుకు మీట్ అండ్ గ్రీట్ పెవిలియన్, వస్తువుల తయారీని ప్రత్యక్షంగా ప్రదర్శించేందుకు డెమో పెవిలియన్లను నెలకొల్పామన్నారు. వీటితో పాటు హెల్త్ డెస్క్, మదర్ కేర్ రూమ్, పిల్లల ఆటల కోసం ప్రత్యేక జోన్ వంటి అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. కాబట్టి విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, వివిధ ప్రాంతాల ప్రజలు ఈ మేళాను సందర్శించి మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. సమావేశంలో అస్సాంకు చెందిన లఖ్‌పతిదీదీ బర్నాలి పాఠక్ తమ చేనేత వస్త్రాలు, తెలంగాణకు చెందిన లఖ్‌పతిదీదీ రాధిక తమ హస్తకళాభరణాలకు సరస్ మేళా గొప్ప వేదికగా నిలుస్తోందని.. విజయవాడ, పరిసర ప్రాంత ప్రజలు తమను ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ఇంత మంచి అవకాశం కల్పిస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మీడియా సమావేశం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, ఇతర అధికారులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి, కళాకారులను అభినందించారు.

# ఆంధ్ర--తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు.

- **అక్రమ మద్యం, నగదు రవాణాపై నిఘా.. ఎస్సై క్రాంతి కుమార్ హెచ్చరిక.**

**ఏలూరు జిల్లా :** జీలుగుమిల్లి (మం) తాటియాకుల గూడెం వద్ద ఆంధ్ర--తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్‌లో పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు, జీలుగుమిల్లి ఎస్సై వి. క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి అక్రమంగా మద్యం తరలించకుండా, ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా నగదు రవాణా జరగకుండా అధికారులు నిఘా ఏర్పాటు చేశారు,ఈ సందర్భంగా ఎస్సై వి. క్రాంతి కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలించినా, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదు రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# మంత్రి కొండపల్లి సారథ్యంలో టీడీపీలోకి భారీ చేరికలు

**గజపతినగరం, అక్టోబర్ 22:** నియోజకవర్గ పరిధిలోని బొండపల్లి మండలం గొట్లం గ్రామంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. రాష్ట్ర సాధికారిక శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గౌరవ నీయులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారాలోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై చేరికలు జరుగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కామవరపుకోటలో 49 నామినేషన్లు సిఐ సుభాష్ ఆధ్వర్యంలో బందోబస్తు

**కామవరపుకోట, అక్టోబర్ 22:** కామవరపుకోట మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నిమిత్తం రెండవ రోజు గురువారం 45 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీ మహేందర్ నాథ్ తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్లను శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ ఓ అండ్ ఎంపీడీవో అమీర్, తహసిల్దార్ ఎలీషా తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల్లో మొత్తం 49 నామినేషన్లు దాఖలు అయ్యాయని తెలిపారు. ఇక కాంగ్రెస్ – 1, జనసేన 3, టీడీపీ 19, వైఎస్సార్‌సీపీ 21, స్వతంత్ర్య 1 నామినేషన్లు దాఖలు అయినట్టు మహేందర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న నామినేషన్ల కేంద్రంను జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్ గురువారం పరిశీలించారు. తడికలపూడి ఎస్సై వల్లి పద్మ లతోపాటు పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎన్నికల నిబంధనల ప్రకారం గుంపులుగా ఉండటం నిషేధమన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, పోలీసు వారికి సహకరించాలని లేదంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. ఇదిలా ఉండగా ఎంపీటీసీల అభ్యర్థులతో పాటు డమ్మీ అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు. కూటమి పార్టీ తరపునుండి ఎంపీపీ అభ్యర్థిగా కొయ్యగూర వెంకటేష్, నల్లమల్లి మోహనరావు, వైఎస్సార్ సీపీ నుండి ఎంపీపీ అభ్యర్థిగా మద్దిరామయ్యలు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు.




## జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ

**ఏలూరు, అక్టోబర్, 22 :** జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎక్కడా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలపై ఆర్ఓ లు, ఏఆర్ఓ లు, అధికారులు, సిబ్బందితో కలెక్టర్ గురువారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నామినేషన్ పత్రాల స్వీకరణలో ఎన్నికల కమిషన్ జారీచేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. నామినేషన్ స్వీకరణలో ముందు వచ్చిన వారు ముందు ప్రాతిపదికన తీసుకోవాలని, నిర్దేశించిన సమయంలోగా నామినేషన్ కేంద్రానికి వచ్చిన ప్రతీ ఒక్కరికి నామినేషన్ తీసుకోవాలన్నారు. నామినేషన్ పత్రంతోపాటు దాఖలు చేసివలసిన ధ్రువీకరణ పత్రాలను చెక్ లిస్ట్ ద్వారా సరిచూసుకోవాలి, ఏదైనా ధ్రువీకరణ పత్రం జతపరచకపోతే, సదరు విషయాన్నీ అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. ఈనెల 23వ తేదీ నామినేషన్ల చివరి తేదీ కావడంతో అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం దృష్ట్యా రిటర్నింగ్ అధికారులు నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉంటె, అవసరమైతే పోలీసు అధికారులతో చర్చించి డ్రోన్ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణ అత్యంత ప్రధానమైనదని, జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియపై రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని, ఎక్కడైనా పొరపాటు చేస్తే కఠిన చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ ఎం. కృష్ణ మోహన్, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, ఆర్ఓ లు, ఏఆర్ఓ లు, పాల్గొన్నారు.



## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్,



**ఏలూరు, అక్టోబర్ 22 :** జిల్లాలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ గురువారం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెందులూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎంపీటీసీ నామినేషన్ల కేంద్రాన్ని ఎస్పీ సందర్శించి, అక్కడ జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను మరియు భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు జేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా కొనసాగుతోందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ జారీ చేసిన ముఖ్య సూచనలు నామినేషన్ కేంద్రాల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలి. 100 మీటర్ల నిబంధన కఠిన అమలు: నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల దూరం నిబంధనను కఠినంగా అమలు చేయాలి. ఎలాంటి అనుమతి లేని వ్యక్తులు, వాహనాలను లోపలికి అనుమతించకూడదు. నిబంధనల ప్రకారం అభ్యర్థితో పాటు కేవలం అనుమతించిన పరిమిత సంఖ్యలోని వ్యక్తులకు మాత్రమే కేంద్రంలోకి ప్రవేశం కల్పించాలన్నారు .అత్యవసర పరిస్థితులు లేదా ఉద్రిక్తతలు తలెత్తితే తక్షణమే స్పందించేందుకు సిబ్బంది ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలి అని,సమస్యాత్మక మరియు కీలక ప్రాంతాల్లో డ్రోన్ల సహాయంతో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. జిల్లాలో సున్నిత ప్రాంతాలుగా గుర్తించిన చోట ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించి, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేస్తున్నామన్నారు.

నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
అక్టోబర్ 23, 2026


# ఉత్కంఠ పోరులో భారత్ విజయం



### ఆఖర్లో నమన్ ధీర్ విధ్వంసం..
### న్యూజిలాండ్‌పై నాలుగు వికెట్లతో గెలుపు
### 225 పరుగుల భారీ లక్ష్యం ఛేదన.. సంజు శాంసన్ మెరుపులు.. శ్రేయస్ అయ్యర్ పోరాటం

**హైదరాబాద్:** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. భారీ లక్ష్య ఛేదనలో చివరి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. చివర్లో నమన్ ధీర్ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత జట్టుకు విజయాన్ని అందించాడు. కేవలం 15 బంతుల్లోనే 42 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు.తొలుత టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. గ్లెన్ ఫిలిప్స్ అజేయంగా 81 పరుగులతో చెలరేగగా, ఫిన్ అలెన్ 45, టిమ్ సీఫెర్ట్ 24 పరుగులతో రాణించారు. భారత బౌలర్లు ప్రత్యర్థి పరుగుల వేగాన్ని అడ్డుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ శుభారంభం అందించారు. సంజు 33 బంతుల్లో 67 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అభిషేక్ శర్మ 29 పరుగులతో రాణించాడు. తొలి వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ విజయం దిశగా సాగుతున్నట్లు కనిపించింది.అయితే స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. సంజు శాంసన్ ఔటైన తర్వాత తిలక్ వర్మ, ఇషాన్ కిషన్ తక్కువ పరుగులకే వెనుదిరిగారు. ఈ దశలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 42 పరుగులతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టగా, అక్షర్ పటేల్ 24 పరుగులతో సహకరించాడు.చివరి ఓవర్లలో భారత్ విజయానికి పరుగుల వేగం పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన నమన్ ధీర్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కొంటూ వేగంగా పరుగులు సాధించాడు. చివరి వరకు పోరాడిన నమన్ ధీర్ అద్భుత ప్రదర్శనతో భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. రెండు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అందుకున్న టీమిండియా అభిమానుల్లో ఆనందం నింపింది.భారీ స్కోరు చేసినప్పటికీ న్యూజిలాండ్ విజయాన్ని అందుకోలేకపోయింది. కీలక సమయాల్లో భారత బ్యాటర్లు చూపిన పట్టుదల, చివర్లో నమన్ ధీర్ దూకుడు జట్టుకు విజయాన్ని అందించాయి. ఈ ఉత్కంఠభరిత విజయంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసింది.

# ఆసియా పారా క్రీడల్లో భారత్ జోరు



### పతకాల వేటలో దూసుకెళ్తున్న భారత క్రీడాకారులు
### అథ్లెటిక్స్‌లో అదరగొట్టిన ప్రతిభావంతులు..
### పతకాల పట్టికలో ఐదో స్థానానికి భారత్

**క్రీడా విభాగం:** ఆసియా పారా క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరుస్తూ పతకాల వేటలో దూసుకెళ్తున్నారు. జపాన్‌లోని ఐచినగోయా వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో భారత పారా అథ్లెట్లు పలు విభాగాల్లో సత్తాచాటుతున్నారు. పరుగులు, ఎత్తు దూకుడు, గుండ్రాయి విసురుట, విలువిద్య తదితర క్రీడాంశాల్లో పతకాలు సాధిస్తూ దేశ ప్రతిష్ఠను పెంచుతున్నారు. ముఖ్యంగా అథ్లెటిక్స్‌లో భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు జట్టుకు కొత్త ఉత్సాహాన్ని అందిస్తున్నాయి.**ఒకే విభాగంలో మూడు పతకాలు**పురుషుల గుండ్రాయి విసురు పోటీల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో మూడు పతకాలనూ కైవసం చేసుకున్నారు. ఎఫ్46 విభాగంలో సచిన్ ఖిలారి స్వర్ణ పతకం సాధించగా, మహమ్మద్ యాసర్ రజతం, పర్వీన్ కాంస్యం గెలుచుకున్నారు. ఈ విభాగంలో భారత క్రీడాకారుల ఆధిపత్యం పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పురుషుల ఎత్తు దూకుడు పోటీల్లో ప్రవీణ్ కుమార్ మరోసారి తన సత్తా చాటాడు. 2.05 మీటర్ల ఎత్తు దూకి స్వర్ణ పతకంతో పాటు క్రీడల రికార్డును నెలకొల్పాడు. ఇదే పోటీలో బంటి 1.92 మీటర్ల ఎత్తు దూకి రజత పతకాన్ని సాధించాడు. మరోవైపు పురుషుల గుండ్రాయి విసురు ఎఫ్53 విభాగంలో ఆయుష్ వర్మ స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు.**పరుగుల పోటీల్లోనూ పతకాల పంట**పరుగుల విభాగంలోనూ భారత క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన కనబరిచారు. పురుషుల 100 మీటర్ల టీ47 విభాగంలో దిలీప్ గవిట్ మహదూ స్వర్ణ పతకాన్ని సాధించగా, మహమ్మద్ బాసిల్ రజత పతకాన్ని దక్కించుకున్నాడు. మహిళల 100 మీటర్ల టీ12 విభాగంలో సిమ్రన్ స్వర్ణం సాధించి క్రీడల రికార్డును నెలకొల్పింది. అంతకుముందు మహిళల 200 మీటర్ల టీ12 విభాగంలోనూ సిమ్రన్ స్వర్ణ పతకం గెలుచుకోవడం విశేషం.మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో దీప్తి జీవాంజి స్వర్ణ పతకాన్ని సాధించింది. 56.36 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని క్రీడల రికార్డును నెలకొల్పింది. ఈ విజయంతో అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను మరోసారి నిరూపించుకుంది. పురుషుల 100 మీటర్ల ఇతర విభాగాల్లోనూ భారత అథ్లెట్లు కాంస్య పతకాలు సాధించి జట్టు పతకాల సంఖ్యను పెంచారు.**విలువిద్యలో రజతం**విలువిద్యలో భారత క్రీడాకారిణులు షీతల్ దేవి, పాయల్ నాగ్ మహిళల పారా కాంపౌండ్ జంట విభాగంలో రజత పతకాన్ని సాధించారు. ఫైనల్లో చైనా జంట చేతిలో ఓటమి ఎదురైనా, భారత జోడీ రజత పతకంతో మెరిసింది. ఇతర విభాగాల్లోనూ భారత క్రీడాకారులు పతకాల కోసం పోరాడుతున్నారు.**పతకాల పట్టికలో భారత్ ముందంజ**అక్టోబర్ 21 నాటి పోటీల అనంతరం భారత్ మొత్తం 62 పతకాలతో పట్టికలో ఐదో స్థానానికి చేరుకుంది.

# తొలి టీ20లో న్యూజిలాండ్ భారీ స్కోరు

### ఫిలిప్స్ విధ్వంసం.. భారత బౌలర్లకు పరీక్ష
### 225 పరుగులతో ప్రత్యర్థి ముందు కఠిన లక్ష్యం



**క్రీడా విభాగం:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టీ20లో ఆతిథ్య జట్టు భారీ స్కోరు సాధించింది. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ వేదికగా జరిగిన ఈ పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. దీంతో భారత్ ముందు 226 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.టాస్ గెలిచిన భారత జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్ ఫిన్ అలెన్ వేగంగా పరుగులు సాధించి భారత బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. మరోవైపు టిమ్ సీఫెర్ట్ కూడా తనవంతు సహకారం అందించాడు. దీంతో పవర్‌ప్లేలోనే న్యూజిలాండ్ జట్టు మెరుగైన పరుగులు సాధించింది.**ఫిలిప్స్ మెరుపులు**మధ్య ఓవర్లలో గ్లెన్ ఫిలిప్స్ దూకుడుగా ఆడుతూ స్కోరు వేగాన్ని పెంచాడు. భారీ షాట్లతో భారత బౌలర్లను ఇబ్బందులకు గురిచేశాడు. అతనికి బెవన్ జాకబ్స్ అండగా నిలిచాడు. వీరిద్దరూ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో న్యూజిలాండ్ భారీ స్కోరు దిశగా సాగింది. ఫిలిప్స్ 40 బంతుల్లో అజేయంగా 82 పరుగులు సాధించి జట్టుకు బలమైన స్కోరును అందించాడు. జాకబ్స్ కూడా 31 పరుగులతో రాణించాడు.**భారత బౌలర్లకు నిరాశ**భారత బౌలర్లు ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కీలక సమయాల్లో వికెట్లు తీసినప్పటికీ పరుగుల వేగాన్ని పూర్తిగా అడ్డుకోలేకపోయారు. అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ సాధించారు. అయినప్పటికీ న్యూజిలాండ్ బ్యాటర్లు చివరి ఓవర్లలోనూ దూకుడును కొనసాగించడంతో స్కోరు 225 పరుగులకు చేరింది.భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత బ్యాటర్లపై ఇప్పుడు ఒత్తిడి నెలకొంది. ఆరంభంలోనే వేగంగా పరుగులు సాధించడంతో పాటు వికెట్లు కాపాడుకోవడం భారత్‌కు కీలకం కానుంది. న్యూజిలాండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని లక్ష్యాన్ని చేరుకుంటుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.సంక్షిప్త స్కోరు: న్యూజిలాండ్ 225/4 (20 ఓవర్లు). గ్లెన్ ఫిలిప్స్ 82 నాటౌట్, ఫిన్ అలెన్ 45, బెవన్ జాకబ్స్ 31. భారత బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ సాధించారు.

# అదిరిపోయిన భారత్.. తొలి టీ20లో ఘన విజయం!

### ఉత్కంఠ పోరులో న్యూజిలాండ్‌పై నాలుగు వికెట్లతో గెలుపు
### సంజు శాంసన్ మెరుపులు.. శ్రేయస్ అయ్యర్ పోరాటం.. నమన్ ధీర్ విధ్వంసం



**క్రైస్ట్‌చర్చ్:** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ప్రత్యర్థి నిర్దేశించిన 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చివరి వరకు ఉత్కంఠగా సాగిన పోరులో టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. 19.4 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 230 పరుగులు సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యాన్ని సంపాదించింది.**ఓపెనర్ల అదిరిపోయే ఆరంభం** భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 93 పరుగులు జోడించి జట్టుకు గట్టి పునాది వేశారు. అభిషేక్ శర్మ 29 పరుగులు చేసి వెనుదిరగగా, సంజు శాంసన్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. కేవలం 33 బంతుల్లో 67 పరుగులు సాధించి భారత విజయావకాశాలను మెరుగుపరిచాడు.అయితే ఓపెనర్లు ఔటైన తర్వాత భారత జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. ఒక దశలో 122 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ న్యూజిలాండ్ వైపు మొగ్గినట్లు కనిపించింది. ఈ సమయంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేసి జట్టును ఆదుకున్నాడు.**అయ్యర్ పోరాటం.. అక్షర్ సహకారం** శ్రేయస్ అయ్యర్ 28 బంతుల్లో 42 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఆటలో సంయమనం, దూకుడు రెండూ కనిపించాయి. అక్షర్ పటేల్ 24 పరుగులతో సహకరించడంతో భారత్ విజయంపై ఆశలు సజీవంగా నిలిచాయి. అయినప్పటికీ చివరి ఓవర్లలో పరుగుల అవసరం పెరగడంతో భారత శిబిరంలో ఉత్కంఠ నెలకొంది.**నమన్ ధీర్ మెరుపులు** చివరి దశలో నమన్ ధీర్ అద్భుతంగా చెలరేగాడు. కేవలం 15 బంతుల్లోనే ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 42 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కీలక సమయంలో ఒత్తిడిని అధిగమించి వేగంగా పరుగులు సాధించిన నమన్ ధీర్ భారత విజయాన్ని ఖాయం చేశాడు.**భారీ స్కోరు చేసినా ఓడిన కివీస్** అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ 40 బంతుల్లో అజేయంగా 82 పరుగులు సాధించగా, ఫిన్ అలెన్ 45, డారిల్ మిచెల్ 28, బెవన్ జాకబ్స్ 31 పరుగులతో రాణించారు. భారీ లక్ష్యాన్ని ఛేదించిన భారత్ బ్యాటింగ్ బలాన్ని మరోసారి నిరూపించింది.తొలి మ్యాచ్‌లోనే అద్భుత పోరాటంతో విజయం సాధించిన టీమిండియా సిరీస్‌లో శుభారంభం చేసింది. సంజు శాంసన్ దూకుడు, శ్రేయస్ అయ్యర్ నిలకడ, నమన్ ధీర్ మెరుపులు భారత విజయానికి ప్రధాన కారణాలయ్యాయి.సంక్షిప్త స్కోరు: న్యూజిలాండ్ 225/4 (20 ఓవర్లు). భారత్ 230/6 (19.4 ఓవర్లు). భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. సిరీస్‌లో 10 ఆధిక్యం సాధించింది.



# పారా ఆసియా క్రీడల్లో భారత్‌కు స్వర్ణ కాంతులు

### శీతల్ దేవి, తోమన్ కుమార్ జోడీకి పసిడి పతకం
### ఇండోనేషియాపై అద్భుత విజయం.. పతకాల వేటలో దూసుకెళ్తున్న భారత క్రీడాకారులు




**క్రీడా విభాగం:** ఆసియా పారా క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. విలువిద్యలో శీతల్ దేవి, తోమన్ కుమార్ జోడీ స్వర్ణ పతకాన్ని సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచింది. మిశ్రమ జట్టు విభాగంలో జరిగిన తుదిపోటీలో భారత జోడీ 151148 పాయింట్ల తేడాతో ఇండోనేషియా జంటను ఓడించింది. ఈ విజయంతో భారత పతకాల ఖాతాలో మరో స్వర్ణం చేరింది.**ఆరంభం నుంచే ఆధిపత్యం**తుదిపోటీలో భారత జోడీ ఆరంభం నుంచే ఆత్మవిశ్వాసంతో బాణాలు సంధించింది. తొలి దశలో స్వల్ప ఆధిక్యం సాధించిన భారత క్రీడాకారులు, రెండో దశలో తమ ప్రదర్శనను మరింత మెరుగుపరుచుకున్నారు. దీంతో ప్రత్యర్థిపై ఆధిక్యాన్ని పెంచుకున్నారు. మూడో దశలో ఇండోనేషియా జోడీ గట్టిపోటీ ఇచ్చినప్పటికీ భారత క్రీడాకారులు ఒత్తిడికి లోనుకాలేదు. చివరి దశలో ఇరు జట్లు సమానంగా పాయింట్లు సాధించాయి. అయినప్పటికీ అంతకుముందు సాధించిన ఆధిక్యంతో భారత్ 151148 పాయింట్ల తేడాతో విజయం అందుకుంది.**సెమీఫైనల్లోనూ సత్తాచాటిన జోడీ**తుదిపోటీకి ముందు జరిగిన అర్హత పోటీలోనూ భారత జోడీ అద్భుతంగా రాణించింది. చైనీస్ తైపీ జట్టుతో జరిగిన పోటీలో 142141 పాయింట్ల స్వల్ప తేడాతో గెలిచి తుదిపోటీకి చేరుకుంది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో భారత క్రీడాకారులు సంయమనం పాటిస్తూ విజయాన్ని అందుకున్నారు.**శీతల్ దేవి అసాధారణ ప్రతిభ** శీతల్ దేవి తన శారీరక పరిమితులను అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తోంది. చేతులు లేకుండానే జన్మించిన ఆమె కాళ్లు, భుజం, దవడ సహాయంతో విల్లును సంధిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. పట్టుదల, కఠోర సాధనతో ప్రపంచ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈసారి తోమన్ కుమార్‌తో కలిసి స్వర్ణ పతకాన్ని సాధించి భారత కీర్తిని ఇనుమడింపజేసింది.**స్వాతి చౌదరికి రజత పతకం**మహిళల వ్యక్తిగత విలువిద్య పోటీల్లో భారత క్రీడాకారిణి స్వాతి చౌదరి రజత పతకాన్ని సాధించింది. తుదిపోటీలో చైనాకు చెందిన చెన్ మెంగ్‌కాన్‌తో తలపడి 46 పాయింట్ల తేడాతో ఓటమి ఎదుర్కొన్నప్పటికీ, రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ విజయంతో భారత పారా విలువిద్యలో మరో మైలురాయిని అధిగమించింది.**పతకాల పట్టికలో భారత్ ముందంజ**భారత క్రీడాకారులు అథ్లెటిక్స్, విలువిద్యతో పాటు పలు క్రీడాంశాల్లో పతకాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. స్వర్ణాలు, రజతాలు, కాంస్యాలతో పతకాల సంఖ్యను పెంచుకు ంటూ పోటీల్లో తమ ఆధిపత్యాన్ని చాటుతున్నారు. ప్రతి విజయం భారత క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.శీతల్ దేవి, తోమన్ కుమార్ జోడీ సాధించిన స్వర్ణం భారత పారా క్రీడా రంగానికి మరో గర్వకారణంగా నిలిచింది. వైకల్యాలను అధిగమించి పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని వారు నిరూపించారు. రాబోయే పోటీల్లోనూ భారత క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించి దేశ ప్రతిష్ఠను పెంచుతారని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.

# పెళ్లి పీటలెక్కనున్న 'హనుమాన్' హీరో..

## తేజ సజ్జా వివాహ ముహూర్తం ఫిక్స్!



టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడు. డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తన వివాహం జరగనున్నట్లు వెల్లడించాడు. నవంబర్‌లో నిశ్చితార్థం నిర్వహించి, ఆ తర్వాతి నెలలో పెళ్లి వేడుక జరగనుంది. తనది పెద్దలు కుదిర్చిన వివాహమని, తల్లిదండ్రులే సంబంధం ఖరారు చేశారని తేజ తెలిపాడు.

తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ గోప్యంగా ఉంచే తేజ.. పెళ్లి వేడుకను కూడా నిరాడంబరంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఉదయ్‌పూర్‌లో వివాహం అనంతరం హైదరాబాద్‌లో రిసెప్షన్ నిర్వహించనున్నారు.

తనకు కాబోయే భార్య కుటుంబానికి సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధాలు లేవని తేజ వెల్లడించాడు. వారు టెక్నాలజీ రంగంలో ఉన్నారని, ఆమె ప్రస్తుతం తన తండ్రితో కలిసి పనిచేస్తోందని చెప్పాడు. అమెరికాలో పెరిగిన ఆమెకు సినీ ప్రముఖుల ప్రపంచం, ప్రచార హడావుడి గురించి పెద్దగా పరిచయం లేదని తెలిపాడు. ఆ విషయం తనకు బాగా నచ్చిందని, పెళ్లి తర్వాత కూడా ఆమె వ్యక్తిగత జీవితానికి గోప్యత ఉండేలా చూసుకోవాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు.

తనకు కాబోయే భార్య వివరాలను మాత్రం తేజ వెల్లడించలేదు. ఆమె వ్యక్తిగత గోప్యతను కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

'హనుమాన్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా.. ఆ తర్వాత 'మిరాయ్'తోనూ ప్రేక్షకులను అలరించాడు. సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ వ్యక్తిగత జీవితాన్ని మాత్రం కెరీర్‌కు దూరంగా ఉంచుతున్నాడు. ప్రస్తుతం ఆయన ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న 'ది ట్రైటర్స్ తెలుగు' తొలి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు.

# వెంకటేశ్ కోసం 'ఏమో ఏమో ఇది' వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ త్వరలో!

టాలీవుడ్‌లో మరో సినిమా విడుదల వాయిదా పడింది. ప్రీతి ముకుందన్, రోషన్ మేకా జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ చిత్రం 'ఏమో ఏమో ఇది' విడుదల తేదీ మారింది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే, అదే రోజున వెంకటేశ్ నటించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నంబర్: 47' విడుదల కానుండటంతో 'ఏమో ఏమో ఇది' చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని దర్శకుడు శైలేష్ కొలను సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. నటుడు వెంకటేశ్ తమ అందరి హృదయాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఆయన నటించిన 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 30న విడుదలవుతున్న నేపథ్యంలో తమ సినిమా కొత్త తేదీన ప్రేక్షకుల ముందుకు వస్తుందని తెలిపారు. కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. అప్పటివరకు సినిమా పాటలను ఆస్వాదించాలని అభిమానులను కోరారు. మరిన్ని మధురమైన పాటలు రానున్నాయని వెల్లడించారు. శైలేష్ కొలను ప్రకటనపై 'ఆదర్శ కుటుంబం' కథానాయిక శ్రీనిధి శెట్టి స్పందించారు. 'ఏమో ఏమో ఇది' చిత్రబృందానికి ప్రేమాభిమానాలు తెలియజేస్తూ, సినిమా కోసం ఎదురుచూస్తున్నానని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు, వెంకటేశ్, శ్రీనిధి శెట్టి జంటగా నటిస్తున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నంబర్: 47' చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను తొలుత అక్టోబర్ 2న విడుదల చేయాలని భావించారు. ఆ తర్వాత అక్టోబర్ 9కి వాయిదా వేశారు. తాజాగా అక్టోబర్ 30న విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ప్రకటించింది.




# ఇమాన్వి లేటెస్ట్ లుక్.. గ్లామర్ డోస్ అదుర్స్!

సోషల్ మీడియా రీల్స్‌తో కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుని విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న బ్యూటీ ఇమాన్వి ఇస్మాయిల్ ఇప్పుడు మరోసారి ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. ఎలాంటి సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేకుండా కేవలం తన అద్భుతమైన డాన్స్ మూవ్స్, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో నేషనల్ వైడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. తాజాగా షేర్ చేసిన ఫోటోషూట్ పిక్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తున్నాయి. ఆ లేటెస్ట్ లుక్ విశేషాలు ఇప్పుడు చూద్దాం..ట్రెండీ ఆరెంజ్ డ్రెస్‌లో క్యూట్ లుక్స్: ఇమాన్వి తాజాగా పోస్ట్ చేసిన ఫోటోల్లో తనదైన స్టైల్‌లో ఫ్యాషన్ ప్రియులను ఫిదా చేశారు. ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో ఆమె బ్రైట్ ఆరెంజ్ కలర్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో మెరిసిపోయారు. స్క్వేర్ నెక్ లైన్ మరియు ఫ్లేర్డ్ స్కర్ట్ ఉన్న ఈ డిజైనర్ డ్రెస్‌లో ఆమె ప్రిన్సెస్ లాగా అందంగా కనిపిస్తున్నారు. ఇక తన డ్రెస్‌కు మ్యాచింగ్‌గా తలలో పెట్టుకున్న వైట్ బో, చెవులకు గోల్డ్ హూప్ రింగ్స్ ఆమె అందాన్ని మరింత పెంచాయి.ఖాశ్రీంశీ =ముఖ - ప్యారడైజ్ మార్పులు పని చేశాయా?ఖాఁజవతీఅంవఎవత్ సింపుల్ యాక్సెసరీస్.. నాచురల్ మేకప్: ఈ ట్రెండీ లుక్‌కు తగ్గట్టుగానే ఇమాన్వి జ్యువెల్లరీని చాలా సింపుల్‌గా మెయింటైన్ చేశారు. మెడలో ఒక సన్నని లేయర్డ్ నెక్లెస్, చేతికి ఒక డెలికేట్ బ్రాస్‌లెట్, ఉంగరం ధరించి పర్ఫెక్ట్ లుక్‌ను క్రియేట్ చేశారు. జుట్టును వదులుగా విరుచుకుని, ముఖానికి సాఫ్ట్ అండ్ నాచురల్ మేకప్‌తో ఆమె మరింత గ్లామరస్‌గా కనిపిస్తున్నారు. ఇక ఈ ఫొటోల్లో ఆమె ఎక్స్‌ప్రెషన్స్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.





# చొక్కా నలగకుండా రూ.500 కోట్లు కొట్టడం రజనీకే సాధ్యం..

## 'జైలర్ 2'పై అల్లు అర్జున్ ప్రశంసలు



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' సినిమాపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించాడు. రజనీకాంత్ స్టార్‌డమ్, స్టైల్, ఆరా ఈ సినిమాలో అద్భుతంగా కనిపించాయని కొనియాడాడు. ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచే కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఆకట్టుకుందని పేర్కొన్నాడు. ఈ సందర్భంగా చిత్రబృందానికి అభినందనలు తెలిపాడు.

ఈ మేరకు అల్లు అర్జున్ ఎక్స్ వేదికగా స్పందించాడు. "రజనీ సార్ స్టార్‌డమ్, స్వాగ్, ఆరాకు 'జైలర్ 2' నిజమైన నిదర్శనం. సినిమా ఆద్యంతం ఉత్కంఠను కొనసాగించే కమర్షియల్ ఎంటర్‌టైనర్. అనిరుధ్ అదరగొట్టాడు. నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాత ఈ సినిమా కోసం తమ హృదయాలను పెట్టి పనిచేశారు. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ అద్భుతమైన హిట్ అందించాడు. చొక్కా నలగకుండా రూ.500 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం ఒక్క రజనీగారికే సాధ్యం" అని ప్రశంసించాడు.

'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల వసూళ్ల మార్కును దాటడంతో పలువురు సినీ ప్రముఖులు ఇప్పటికే చిత్రబృందాన్ని అభినందించారు. బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ సినిమా చూసిన తర్వాత స్పందిస్తూ.. రజనీకాంత్ ఆరా మరో స్థాయిలో ఉందని అన్నాడు. థియేటర్‌లో ప్రతి ఎంట్రీకి చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ సినిమాను ఆస్వాదించానని తెలిపాడు.

ప్రముఖ నటుడు కమల్ హాసన్ కూడా తన స్నేహితుడు రజనీకాంత్‌కు అభినందనలు తెలిపాడు. సినిమా ప్రపంచవ్యాప్తంగా సూపర్‌హిట్‌గా నిలిచిందన్న వార్త సంతోషాన్ని కలిగించిందని పేర్కొంటూ దర్శకుడు నెల్సన్, సంగీత దర్శకుడు అనిరుధ్, సన్ పిక్చర్స్ బృందానికి శుభాకాంక్షలు చెప్పాడు.

జాతీయ అవార్డు గ్రహీత ధనుష్ తొలి రోజు తొలి ఆట చూసిన అనంతరం 'జైలర్ 2' తప్పక చూడాల్సిన సినిమా అని ప్రశంసించాడు. ప్రతి తలైవర్ అభిమానికీ ఇది గొప్ప విందు అని పేర్కొన్నాడు. దర్శకులు లింగుస్వామి, వెంకట్ ప్రభు, కార్తీక్ సుబ్బరాజ్ తదితరులు కూడా రజనీకాంత్ నటనను, నెల్సన్ దర్శకత్వాన్ని, అనిరుధ్ సంగీతాన్ని కొనియాడారు.